# విశాల భారతి

16-06-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 162


తెలంగాణ రాజకీయాలు రసవత్తరమైన మలుపులు తిరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య సాగుతున్న మాటల యుద్ధం రాష్ట్రంలో కొత్త చర్చకు దారితీస్తోంది. ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకోవడం, ఆరోపణలు గుప్పించుకోవడం దైనందిన వ్యవహారంగా మారింది. సింగరేణి గనుల నుంచి మొదలై తాజాగా మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించిన ఐఆర్ఎఫ్‌సీ రుణాల వరకు ప్రతి అంశం రాజకీయ రచ్చకు కేంద్రబిందువుగా మారుతోంది. అభివృద్ధి పనుల కోసం రావాల్సిన నిధులు రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి ఆరోపిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ఎండగట్టడమే తన బాధ్యత అని కేంద్ర మంత్రి బదులిస్తున్నారు. ఈ పరిణామాలు గమనిస్తుంటే, ఇద్దరు అగ్రనేతల మధ్య వ్యక్తిగత స్థాయిలో అసహనం పెరిగిపోతోందన్నది స్పష్టమవుతోంది. - విశాలభారతి, స్టేట్ బ్యూరో

# ఇంకెంతకాలం..?

## రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డిల మధ్య తీవ్ర మాటల యుద్ధం

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని రేవంత్ ఆరోపణ

ఆయన కేసీఆర్ అజెండాను అమలు చేస్తున్నారని సీఎం వాదన

రాజకీయ పోరుతో మెట్రో, సింగరేణి ప్రాజెక్టులకు నిధుల కష్టం

సిద్ధాంతాలు పక్కనబెట్టి అధికారం కోసం ముసుగు పోరాటాలు

నాయకుల ఆధిపత్య పోరులో సామాన్యులకు తీవ్ర నష్టం



రాష్ట్ర మెట్రో విస్తరణ కోసం కేంద్రం నుంచి ఆమోదం పొందాల్సిన ఐఆర్ఎఫ్‌సీ రుణాలు కీలకంగా మారాయి. ఈ నిధుల విడుదలలో కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌పై ఒత్తిడి తెస్తున్నారని రేవంత్ రెడ్డి బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. తన నియోజకవర్గ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే సహించేది లేదని, నిధులు విడుదల కాకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ముఖ్యమంత్రి గట్టిగా చెబుతున్నారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించడం కంటే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ అజెండాను అమలు చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని రేవంత్ విమర్శిస్తున్నారు. ఒక ప్రజా ప్రతినిధిగా, కేంద్రమంత్రిగా రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేయడం సరికాదని ఆయన వాదిస్తున్నారు.

రేవంత్ రెడ్డి పదేపదే కిషన్ రెడ్డిని కేసీఆర్ మనిషిగా, కేటీఆర్ సన్నిహితుడిగా చిత్రీకరించడం వెనుక బలమైన వ్యూహం కనిపిస్తోంది. బీజేపీ అగ్రనేతలను, బీఆర్ఎస్ నాయకత్వాన్ని కలిపి ఒకే గాటన కట్టడం ద్వారా రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలను తన వైపు తిప్పుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. బీజేపీ ముసుగులో బీఆర్ఎస్ పని చేస్తోందని కాంగ్రెస్ వాదిస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వంలో బీఆర్ఎస్ పాత్ర ఉందని బీజేపీ ఆరోపిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీ లోపాయికారీ ఒప్పందంతోనే రాష్ట్రంలో తమ ప్రభుత్వానికి ఇబ్బందులు సృష్టిస్తున్నారని రేవంత్ గట్టిగా నమ్ముతున్నారు. ఈ త్రిముఖ పోరులో ప్రజలకు అసలు వాస్తవాలు వివరించడం ద్వారా, ప్రత్యర్థి పార్టీల

మిగతా 2లో..

### కేటీఆర్ కుట్రలకు కిషన్ రెడ్డి సహకారం

- ఎల్ అండ్ టీ మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కేంద్రం సూచించింది
- రుణ బదిలీని కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారు
- కేంద్రం ఎన్ఓసీ ఇస్తే, సొంతంగానే మెట్రో ఫేజ్-2 పూర్తి చేస్తాం
- సికింద్రాబాద్ అభివృద్ధికి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారు

02

### మెట్రో ఆస్తులు కొల్లగొట్టేందుకు రేవంత్ కుట్ర

- మెట్రో జాప్యానికి కేంద్రం కారణమన్నది అబద్ధమని కేటీఆర్ విమర్శ
- అనుమతులు సాధించడంలో రేవంత్ పూర్తిగా విఫలమయ్యారు
- కేసుల మాఫీ కోసం రేవంత్ బీజేపీతో లోపాయికారీ ఒప్పందం

02



# యుద్ధం ఆగింది..!

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పంద డ్రాఫ్ట్

జూన్ 19న అధికారికంగా సంతకాలు

స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ జలసంధి రీఓపెన్

గ్లోబల్ ఆయిల్ ధరల స్థిరీకరణ

ఇరాన్ పై ఉన్న శాంక్షన్స్ (ఆంక్షల) సడలింపు

ఫ్రీజ్ అయిన నిధుల ($25 బిలియన్లు) ఎత్తివేత

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాలు ఒక కీలకమైన డ్రాఫ్ట్ ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దాడులను నిలిపివేయడం, స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ జలమార్గాన్ని తిరిగి తెరవడం, ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్‌పై మళ్లీ చర్చలు ప్రారంభించడం ఈ ఒప్పందంలో ప్రధానాంశాలుగా నిలిచాయి. ఈ తాత్కాలిక ప్రణాళిక ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షల సడలింపుతో పాటు దీర్ఘకాలిక వివాదాలను పరిష్కరించుకోవడానికి ఇరు దేశాలకు 60 రోజుల నెగోషియేటింగ్ విండోను కల్పిస్తోంది. యుద్ధ వాతావరణాన్ని ముగించి శాంతియుత సెటిల్‌మెంట్‌కు మార్గం సుగమం చేయడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశ్యం. జూన్ 19న ఈ అగ్రిమెంట్‌పై ఇరు దేశాలు సంతకాలు చేయనున్నాయి. దీని వల్ల మిడిల్ ఈస్ట్‌లో పెద్ద యుద్ధం వస్తుందన్న భయం తగ్గడమే కాకుండా గ్లోబల్ మార్కెట్లలో ఆయిల్ సప్లైపై ఉన్న టెన్షన్ తొలగిపోనుంది. ఇది తుది శాంతి ఒప్పందం కాదు, కేవలం టెన్షన్స్‌ను తక్షణమే తగ్గించడానికి ఏర్పాటు చేసిన ఇంటర్మ్ ప్లాన్ మాత్రమే. ఈ అగ్రిమెంట్‌లో అత్యంత కీలకమైన పాయింట్ స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ జలమార్గం. ఇది పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే అత్యంత ఇరుకైన జలమార్గం.

మిగతా 2లో..

# కిడ్నీ మరణాల్లో తెలంగాణ టాప్

- దేశంలోనే కిడ్నీ మరణాలు తెలంగాణలో అత్యధికం
- లక్ష జనాభాలో 10,600 మందికి ఈ సమస్య ఉంది
- డయాబెటిస్ నియంత్రణలో లేకపోవడమే కారణం
- వ్యాధి ముదిరాకే తెలియడం ప్రాణసంకటంగా మారుతోంది
- ప్రాథమిక పరీక్షలు అందుబాటులో లేవు
- జీవనశైలి మార్పులు, క్రమబద్ధమైన ఆరోగ్య పరీక్షలే మార్గం

04





# బడి బస్సుల్లో భద్రత ఎంత?

ఫిట్‌నెస్ లేని బస్సులు, అనుభవం లేని డ్రైవర్లతో ప్రాణాలకు ముప్పు

రవాణా శాఖ కేవలం ఆరంభంలోనే నామమాత్రపు తనిఖీలు చేస్తోంది

కనీస భద్రతా పరికరాలను యాజమాన్యాలు గాలికి వదిలేశాయి

నిబంధనల ఉల్లంఘనపై అధికారులు కఠినంగా వ్యవహరించడం లేదు

కాలం చెల్లిన, తుప్పు పట్టిన బస్సులు యథేచ్ఛగా నడుస్తున్నాయి

తల్లిదండ్రులు నిలదీయాలి, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పాఠశాలల పునఃప్రారంభం వేళ ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు విద్యార్థుల ప్రాణాలకు పట్టుకొమ్మలుగా మారుతున్నాయి. ఇంటి వద్దే పికప్, డ్రాప్ సౌకర్యాలు కల్పిస్తామంటూ వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు, భద్రత విషయంలో మాత్రం అత్యంత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. కండిషన్ లేని వాహనాలను రోడ్లెక్కిస్తూ చిన్నారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ఫిట్‌నెస్ నిబంధనలను తుంగలో తొక్కుతూ, శిక్షణ లేని డ్రైవర్ల చేతిలో వాహనాలను పెడుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే రవాణా శాఖ తూతూమంత్రంగా తనిఖీలు చేపట్టడం, గడువు ముగిసిన తర్వాత ఆ ఊసే ఎత్తకపోవడం రివాజుగా మారింది. ఈసారి కూడా అదే పరిస్థితి పునరావృతమైంది. రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల ఆధ్వర్యంలో సుమారు 26 వేల బస్సులు తిరుగుతున్నాయి. శనివారం

మిగతా 3లో..

# సింగరేణి రూ.1600కోట్ల మాయం?

- 40 లక్షల టన్నుల బొగ్గు తరలిందని హరీశ్ రావు ఆరోపణ
- అవాస్తవ ఆరోపణలని భట్టి విక్రమార్క తిరస్కరణ
- నిందితులే దర్యాప్తు చేయడంపై ప్రతిపక్షం అభ్యంతరం
- జిలెటిన్ స్టిక్స్ కొనుగోళ్లలోనూ అక్రమాల ఆరోపణ
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ రాసినా, వివాదం వీడలేదు
- రాజకీయ విమర్శలతో సంస్థ భవిష్యత్తుపై భయాందోళన

03



# కాంగ్రెస్‌తోనే సింగరేణికి అన్యాయం




సంస్థను ప్రైవేట్ పరం చేసే కుట్రలను ఆపాలి

కార్మికులకు అదనంగా రూ.10,000 వేతనం పెంచాలి

వారసత్వ, పెండింగ్ ఉద్యోగాలను వెంటనే ఇవ్వాలి

డీజిల్, బ్యాటరీ అక్రమ ఒప్పందాలను రద్దు చేయాలి

సంస్థకు నష్టం చేసే ఎండీఓ విధానాన్ని ఆపాలి

అన్ని ప్రాంతాల కార్మికులకు సమాన వేతనం ఇవ్వాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సింగరేణి సంస్థను కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని, మూడున్నర దశాబ్దాల పాటు లాభాల బాటలో పయనిస్తూ రూ. 33 వేల కోట్ల రెవెన్యూను ప్రభుత్వ ఖజానాకు అందించిన ఈ మహావృక్షం నేడు అవినీతి పుట్టగా మారుతుంటే చూడటం బాధాకరమని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మంచిర్యాల కేంద్రంగా జరుగుతున్న సింగరేణి బాట కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న తప్పుడు విధానాలు, నిరంకుశ ధోరణుల వల్ల

మిగతా 3లో..

# అభిజీత్ దిప్కే చెంప చెల్లు

- జైపూర్ సభలో అభిజీత్ దిప్కేపై బహిరంగ దాడి జరిగింది
- నిందితుడిపై కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేయగా, అభిజీత్ శాంతింపజేశారు
- విద్యా అక్రమాలు, పరీక్షా పత్రాల లీకేజీలపై దేశవ్యాప్త ఆందోళనలు
- విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్
- సోషల్ మీడియాలో సీజేపీకి భారీ మద్దతు, ప్రముఖుల తోడ్పాటు
- అహింసా మార్గంలోనే పోరాటం కొనసాగిస్తామని అభిజీత్ ప్రకటన



**విశాలభారతి, జాతీయం:**

రాజస్థాన్‌లోని జైపూర్ నగరంలో సోమవారం జరిగిన నిరసన కార్యక్రమంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ వంటి కీలక పరీక్షల్లో జరిగిన అవకతవకలపై కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన రణరంగాన్ని తలపించింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేను లక్ష్యంగా చేసుకుని ఓ అజ్ఞాత వ్యక్తి బహిరంగంగా దాడికి

మిగతా 3లో..

# ఇంకెంతకాలం..?



**మొదటిపేజీ తరువాయి**

విశ్వసనీయతను దెబ్బతీయడం రేవంత్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. కిషన్ రెడ్డి వ్యక్తిగత ప్రతిష్టను మసకబార్చడం ద్వారా బీజేపీని ఇబ్బందుల్లోకి నెట్టాలని ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభంజనం ముందు నిలబడలేక, బీజేపీ అగ్రనేతలు బీఆర్ఎస్‌తో అక్రమ సంబంధాలు కొనసాగిస్తున్నారని ప్రచారం చేయడంలో రేవంత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఒకపక్క రాష్ట్ర అభివృద్ధి ఆగిపోవడానికి కేంద్రం వైఖరే కారణమని చెబుతూనే, మరోపక్క ఆ వైఖరి వెనుక బీఆర్ఎస్ హస్తం ఉందంటూ ప్రజలను ఆలోచింపజేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రచారం ద్వారా రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీకి ఉండే ఆదరణను తగ్గించడమే కాకుండా, బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఏకాకిని చేయాలని ఆయన పథకం వేస్తున్నారు. ఈ రాజకీయ వ్యూహ రచనలో రేవంత్ రెడ్డి చాణక్యం స్పష్టంగా గోచరిస్తోంది. బీజేపీ అగ్ర నాయకత్వం కూడా రాష్ట్రంలో తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తోందనేది బలమైన వాదన. ఒంటరి పోరాటం ద్వారా అధికారాన్ని అందుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టమని గ్రహించిన అధిష్టానం, తెరచాటు పొత్తుల వైపు మొగ్గు చూపుతోందనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. కిషన్ రెడ్డి ద్వారా బీఆర్ఎస్ అధిష్టానంతో పరోక్ష చర్చలు జరుగుతున్నాయనే ప్రచారం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. బీజేపీ లక్ష్యాలను చేరుకోవడానికి బీఆర్ఎస్ మద్దతు అవసరమని భావించి, కిషన్ రెడ్డి చురుగ్గా పావులు కదుపుతున్నారనేది రేవంత్ ప్రధాన ఆరోపణ. ఈ రకమైన రాజకీయ పొత్తులకు పునాదులు పడుతున్నాయని రేవంత్ రెడ్డి పదేపదే హెచ్చరించడం వెనుక ముమ్మందు రాబోయే రాజకీయ సవాళ్లను ముందుగానే అంచనా వేసే ప్రయత్నం ఉంది. అధికార పీఠం కోసం జరుగుతున్న ఈ త్రిముఖ పోరాటంలో సిద్ధాంతాల కంటే రాజకీయ అవకాశవాదమే రాజ్యమేలుతోంది. కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకరిపై ఒకరు ముసుగు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించుకోవడం దశాబ్ద కాలంగా సాగుతోంది. ఒక పార్టీని దెబ్బకొట్టడానికి మరో పార్టీతో చేతులు కలపడం ఇప్పుడు సర్వసాధారణమైపోయింది. ప్రజల సమస్యల కంటే రాజకీయ ఆధిపత్యం, అధికారం దక్కించుకోవడమే ప్రధాన లక్ష్యంగా పార్టీలు పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజలకి ఏది నిజమో, ఏది అబద్ధమో అర్థం చేసుకోవడం కష్టంగా మారుతోంది. రాజకీయ నాయకుల మాటల్లోని వాస్తవాలను, అబద్ధాలను వేరు చేసి చూడాల్సిన స్థితిలో ఓటర్లు ఉన్నారు. రాజకీయ వ్యూహాలు, ప్రతివ్యూహాలతో కూడిన ఈ ముసుగు రాజకీయాలు తెలంగాణ అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడంలో జాప్యం చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై నిందలు వేస్తూ కాలం వెళ్లదీస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల కంటే రాజకీయ ఆరోపణలకే ఎక్కువ ప్రాధాన్యత దక్కుతోంది. మెట్రో విస్తరణ, సింగరేణి గనులు, రుణాల మంజూరు వంటి ప్రజా సంక్షేమ ప్రాజెక్టులు రాజకీయ కక్షల మధ్య నలిగిపోతున్నాయి. ఈ క్రమంలో నిధుల విడుదల ఆలస్యమైతే, చివరికి నష్టపోయేది సామాన్య ప్రజలేననే వాస్తవాన్ని రాజకీయ పార్టీలు గుర్తించాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే, ఈ ముసుగు రాజకీయాల ముగింపు త్వరలో ఉండదని స్పష్టమవుతోంది. అధికార పీఠం దక్కించుకోవడానికి లేదా దక్కకుండా చేయడానికి ఏ పార్టీ ఎంతవరకు వెళ్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, ఒకరిని మించి మరొకరు ఎత్తుగడలు వేస్తూ ఈ ముగ్గురు కీలక నాయకులు తెలంగాణ రాజకీయాలను వేడెక్కిస్తున్నారు. భవిష్యత్తులో ఈ రాజకీయ సమీకరణాలు ఏ మలుపు తిరుగుతాయోనని రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఆరోపణలు, ప్రతి ఆరోపణలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో ఈ ముసుగు రాజకీయ నాటకం ఎప్పటికి ముగుస్తుందో తెలియని అయోమయ స్థితిలో తెలంగాణ ఉంది. ఈ రాజకీయ సమరం రాబోయే కాలంలో మరింత ఉధృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల వరకు ఈ ట్రై యాంగిల్ రాజకీయాలు వివిధ రూపాల్లో కొనసాగే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి, కేసీఆర్ వంటి అగ్రనేతలు తమ పార్టీల గెలుపు కోసం ఏమేమి చేయబోతున్నారోనన్న ఆసక్తి రాజకీయ విశ్లేషకులలో నెలకొంది. పార్టీల మధ్య జరుగుతున్న ఈ రాజకీయ ఆధిపత్య పోరు చివరకు ఎటు దారితీస్తుందో, తెలంగాణ భవిష్యత్తును ఎలా మార్చబోతుందో కాలమే నిర్ణయించాలి. పార్టీల ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని గుర్తించినప్పుడే ఇటువంటి విమర్శల పర్వం ముగిసే అవకాశం ఉంది. తెలంగాణ రాజకీయాలలో చోటు చేసుకుంటున్న ఈ కీలక మార్పులు ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమే అయినప్పటికీ, అవి రాష్ట్ర అభివృద్ధిని ఏ మేరకు ప్రభావితం చేస్తాయనేది కీలకం. రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలలో నిజమెంత, కిషన్ రెడ్డి చెబుతున్న వాదనలో వాస్తవమెంత అన్నది ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. పార్టీల గెలుపోటములను నిర్ణయించే శక్తి ఓటర్లకు ఉందని రాజకీయ నాయకులు గ్రహించాలి. ముసుగు రాజకీయాలు తొలగిపోయి, అభివృద్ధి రాజకీయాలు మొదలైనప్పుడే తెలంగాణ రాష్ట్రం మరింత వేగంగా పురోగమిస్తుంది. ఆ రోజు కోసం తెలంగాణ ప్రజలు నిరీక్షిస్తున్నారు.

## మెట్రో ఆస్తులు కొల్లగొట్టేందుకు రేవంత్ కుట్ర

- **మెట్రో జాప్యానికి కేంద్రం కారణమన్నది అబద్ధమని కేటీఆర్ విమర్శ**
- **అనుమతులు సాధించడంలో రేవంత్ పూర్తిగా విఫలమయ్యారు**
- **కేసుల మాఫీ కోసం రేవంత్ బీజేపీతో లోపాయికారీ ఒప్పందం**
- **గతంలో మెట్రో మొదటి దశను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేశామన్నారు**
- **ఢిల్లీ పర్యటనల ఫలితంపై రేవంత్ శ్వేతపత్రం విడుదల చేయాలి**
- **పాలనా వైఫల్యానికి సీఎం ప్రజలకు క్షమాపణ చెప్పాలి**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగరాభివృద్ధిలో అత్యంత కీలకంగా పరిగణించే మెట్రో రెండో దశ ప్రాజెక్టును పట్టాలెక్కించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెట్రో ఫేజ్ 2కు కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని, అనుమతులు ఇవ్వడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వాదనలను కేటీఆర్ పచ్చి అబద్ధాలని కొట్టిపారేశారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకునే క్రమంలోనే ముఖ్యమంత్రి పదేపదే కేంద్రంపై నిందలు వేస్తున్నారని, వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం, తమ చేతకానితనాన్ని దాచుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి ఆడుతున్న నాటకాలు ఎవరూ నమ్మే స్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు. సుమారు 71 సార్లు ఢిల్లీకి ప్రయాణాలు చేసినప్పటికీ, అక్కడ ఉన్న తమ పెద్దల మనసు గెలుచుకోవడంలో లేదా ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను సాధించడంలో ముఖ్యమంత్రి దారుణంగా విఫలమయ్యారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇది పూర్తిగా రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యానికి, దద్దమ్మతనానికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. స్వయంగా తనపై నమోదైన ఓటుకు నోటు కేసు ఉచ్చు రోజురోజుకూ బిగుసుకుంటున్న నేపథ్యంలో, ఆ భయంతోనే బీజేపీ అగ్రనేతలతో రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆయన ఆరోపణలు చేశారు. ఈ రాజకీయ బేరసారాల వల్లే మెట్రో రెండో దశ ప్రాజెక్టు అటకెక్కిందని, రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి తన కేసుల నుంచి బయటపడేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. మెట్రో రెండో దశను సాధించడంలో అట్టర్ ఫ్లాప్ కావడమే కాకుండా, అప్పటికే విజయవంతంగా నడుస్తున్న మొదటి దశ మెట్రో నిర్వహణను కూడా ప్రస్తుత ప్రభుత్వం ఆగమ్యం లేకుండా చేస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల విషయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి తక్షణమే ప్రజలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని, ముక్కు నేలకు రాసి తన వైఫల్యాన్ని అంగీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కూడా వాస్తవాలను విస్మరిస్తూ, అభివృద్ధిని పక్కనపెట్టి కేవలం అబద్ధాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో వంటి మెగా ప్రాజెక్టుల విషయంలో చిత్తశుద్ధి లేని పాలన రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తుందని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ మెట్రో మొదటి దశ పూర్తి కావడంలో కేసీఆర్ ప్రభుత్వం చూపిన సమర్థత అసాధారణమని కేటీఆర్ గుర్తుచేశారు. కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో ఆర్థిక సహకారం లేకపోయినా, రాష్ట్ర ప్రభుత్వమే ముందుకొచ్చి అప్పులు సాధించి మరీ మెట్రో రైలును పట్టాలెక్కించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో పనులలో కేవలం 28 శాతాన్ని మాత్రమే పూర్తి చేసి, ప్రాజెక్టును అనేక చిక్కుల్లో, వివాదాల్లో వదిలేసిందని ఆయన విమర్శించారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు చేపట్టిన కేసీఆర్, మిగిలిన 72 శాతం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి హైదరాబాద్ ప్రజలకు అద్భుతమైన రవాణా వ్యవస్థను అందించారని ఆయన వివరించారు. కేవలం మూడేళ్ల వ్యవధిలోనే మెట్రో నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, నేడు ప్రతిరోజూ సుమారు ఐదు లక్షల మంది ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు. అంతటి గొప్ప ప్రాజెక్టు గురించి ఇప్పుడు బాధ్యత లేని మాటలు మాట్లాడటం ముఖ్యమంత్రికి తగదని ఆయన హితవు పలికారు. ప్రజలకు ఉపయోగపడే పనుల గురించి చర్చించాల్సింది పోయి, లేనిపోని అబద్ధాలతో అసమర్థతను కవర్ చేసుకునే ప్రయత్నం చేయడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో విఫలమైనప్పుడల్లా ఇతరులపై నెపం నెట్టడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని, ఇది రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను, నగర భవిష్యత్తును దెబ్బతీసే విధంగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్న తీరు అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ వంటి అంతర్జాతీయ స్థాయి నగరంలో మెట్రో రెండో దశ ప్రాజెక్టు ఎంతో అవసరమని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఇది ఎంతో తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. అలాంటి ప్రాజెక్టును రాజకీయ ప్రయోజనాల కోసం, కేసుల నుంచి తప్పించుకోవడానికి వాడుకోవడం సరికాదని ఆయన హెచ్చరించారు. కనీస బాధ్యత లేకుండా కేంద్రంపై నెపం నెట్టడం ద్వారా తన అసమర్థతను దాచుకోలేరని, వాస్తవాలను నిరూపించే సత్తా తనకు ఉందని ఆయన సవాల్ విసిరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులన్నీ ఒక దారిలో ఉంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేకపోవడం గమనార్హమని ఆయన విమర్శించారు. కేవలం మాటలకే ప్రాధాన్యత ఇస్తూ, చేతల్లో శూన్యంగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో నగరం వెనకడుగు వేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మెట్రో రెండో దశ విషయంలో ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకోవాలని, ప్రభుత్వ అసమర్థతను గుర్తించాలని ఆయన కోరారు. అభివృద్ధిని ఆపేసి, ఆరోపణలకే పరిమితం కావడం వల్ల నష్టపోయేది సామాన్య ప్రజలేనని ఆయన అన్నారు. మెట్రో రెండో దశకు కేంద్రం నుంచి అనుమతులు రాకపోవడానికి ప్రధాన కారణం రేవంత్ రెడ్డి చేస్తున్న చీకటి ఒప్పందాలేనని, దీనిపై స్పష్టమైన సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఢిల్లీకి పదేపదే తిరుగుతున్న ముఖ్యమంత్రి అక్కడ రాష్ట్రానికి ఏం తెచ్చారో, ఏ ప్రాజెక్టుకు ఎంత నిధులు సాధించారో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన కోరారు. కేవలం తన కేసుల రక్షణ కోసం కేంద్రంతో రాజీ పడటం వల్లనే రాష్ట్ర అభివృద్ధి ఆగిపోతోందని ఆయన ఆరోపించారు. దీనిపై ప్రజల ముందు నిజాలను ఉంచే ధైర్యం ముఖ్యమంత్రికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధిని సాధించడంలో విఫలమైన ప్రభుత్వం, గత పాలనపై బురద చల్లడం ద్వారా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని చూడటం సహజమని ఆయన ఎద్దేవా చేశారు.

## కేటీఆర్ కుట్రలకు కిషన్ రెడ్డి సహకారం

- **ఎల్ అండ్ టీ మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కేంద్రం సూచించింది**
- **రుణ బదిలీని కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారు**
- **కేంద్రం ఎన్ఓసీ ఇస్తే, సొంతంగానే మెట్రో ఫేజ్-2 పూర్తి చేస్తాం**
- **సికింద్రాబాద్ అభివృద్ధికి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారు**
- **కిషన్ రెడ్డి వెనుక ఉండి కేటీఆర్ కుట్రలు చేస్తున్నారు**
- **మొదటి దశ ఆలస్యానికి కేసీఆర్ పాలనే కారణం**





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మెట్రో విస్తరణపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినమైన నిర్ణయానికి సిద్ధమైంది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకోవడమే ఏకైక పరిష్కారమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక విషయాలను వివరించారు. కేంద్రం నుంచి ఎన్‌వోసీ లభిస్తే, ఎటువంటి కేంద్ర భాగస్వామ్యం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా మెట్రో విస్తరణ పనులను పూర్తి చేస్తుందని ఆయన తేల్చి చెప్పారు. మెట్రో రెండో దశ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నామని, నగరాన్ని అంతర్జాతీయ స్థాయి రవాణా సదుపాయాలతో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో మెట్రో ప్రాజెక్టు విషయంలో జరిగిన తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి జైపాల్ రెడ్డి చొరవతో ఈ ప్రాజెక్టు హైదరాబాద్‌కు వచ్చిందని, వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం రోశయ్య ప్రభుత్వంలో తొలి దశ పనులు ఊపందుకున్నాయని ఆయన గుర్తు చేశారు. 2017 నాటికే మొదటి దశ పూర్తి చేయాలనే లక్ష్యంతో అడుగులు పడినా, తెలంగాణ ఆవిర్భావం తర్వాత కేసీఆర్ ప్రభుత్వం చారిత్రక కట్టడాల సాకుతో ప్రాజెక్టును అడ్డుకుంది. ఈ అసంబద్ధ చర్యల వల్ల ప్రాజెక్టు నిర్మాణ కాలం మూడేళ్లు ఆలస్యమై, వ్యయం రూ. 15 వేల కోట్ల నుంచి ఏకంగా రూ. 22 వేల కోట్లకు పెరిగిందని ఆయన ఆరోపించారు. కోవిడ్ సంక్షోభం, నిర్మాణంలో జరిగిన జాప్యం కారణంగా ఎల్ అండ్ టీ సంస్థ భారీ నష్టాల్లో కూరుకుపోయిందని ముఖ్యమంత్రి వివరించారు. గత బీఆర్ఎస్ పాలకులు ప్రజా ప్రయోజనాల కంటే సొంత ఆస్తుల పెంపుకే ప్రాధాన్యత ఇచ్చారని ఆయన విమర్శించారు. దీని ఫలితంగా హైదరాబాద్ మెట్రో సేవల వినియోగం జాతీయ స్థాయిలో 9వ స్థానానికి పడిపోయింది. ఈ దుస్థితిని మార్చడానికి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెట్రో విస్తరణపై దృష్టి సారించింది. రెండో దశ ప్రాజెక్టు కోసం ప్రధానమంత్రిని, సంబంధిత కేంద్ర మంత్రులను కలిసి విన్నవించినా, మొదటి దశను నిర్మించిన ఎల్ అండ్ టీతోనే రెండో దశ కూడా చేపట్టాలనే నిబంధనను కేంద్రం విధించిందని ఆయన పేర్కొన్నారు. అయితే, గత అనుభవాలు, భారీ నష్టాల దృష్ట్యా ఈ ప్రతిపాదనకు ఎల్ అండ్ టీ సంస్థ అంగీకరించలేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దాదాపు రూ. 30 వేల కోట్ల విలువైన ఆస్తులను సృష్టించినా, నిర్వహణ పరంగా ఏటా రూ. 400 కోట్ల నష్టం వస్తుందని ఎల్ అండ్ టీ చేతులెత్తేసింది. రెండో దశలో భాగస్వామ్యం వహించేందుకు, భవిష్యత్తు నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు ఆ సంస్థ నిరాకరించింది. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా, సమస్య పరిష్కారానికి మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడమే మార్గమని వారు సూచించారని ఆయన తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో ఎల్ అండ్ టీ నుంచి రూ. 30 వేల కోట్ల ఆస్తులను రూ. 15 వేల కోట్లకే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ మెట్రో ప్రాజెక్టుపై ఎల్ అండ్ టీ సంస్థ 8.25 శాతం వడ్డీతో బ్యాంకుల నుంచి రూ. 13,600 కోట్ల మేర రుణం తీసుకుంది. ఈ అప్పును రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని తాము కేంద్రాన్ని కోరామని రేవంత్ రెడ్డి చెప్పారు. గత ప్రభుత్వం కేసీఆర్ హయాంలో పిఎఫ్‌సి, ఆర్ ఈ సి ద్వారా 9 నుంచి 11.5 శాతం అధిక వడ్డీతో సుమారు రూ. 3 లక్షల 15 వేల కోట్ల అప్పులు ఎటువంటి గ్యారెంటీ లేకుండానే తీసుకుందని ఆయన ఆరోపించారు. తాము ఆ పద్ధతికి భిన్నంగా జపాన్ సంస్థ నుంచి 4 శాతం వడ్డీకే రూ. 13,600 కోట్ల రుణం పొందేలా ఒప్పందం చేసుకున్నామని ఆయన వివరించారు. దీనికి సంబంధించి ఇప్పటికే రూ. 1400 కోట్ల వాయిదాను తాము చెల్లించామని ఆయన స్పష్టం చేశారు. ఈ రుణ బదిలీ ప్రక్రియ ఆశాజనకంగా సాగుతుందనుకున్న తరుణంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడ్డారని ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మే 20న ఖట్టర్, 21న అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి ప్రాజెక్టుకు నిధులు ఇవ్వవద్దని కిషన్ రెడ్డి అభ్యర్థించారని ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా ఉండి, మెట్రో విస్తరణ జరగాల్సిన ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కిషన్ రెడ్డి జోక్యం వల్లే జపాన్ సంస్థ నుంచి విడుదలైన నిధులు ఐఆర్ఎఫ్‌సి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ కావడం లేదని ఆయన ఆరోపించారు. ఈ ఆలస్యానికి జరిగే వడ్డీ భారంపై కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వు బ్యాంకు ఆమోదంతో కూడిన పత్రాలను కూడా సమర్పించినా, కిషన్ రెడ్డి ఒత్తిడితో ఫైలు ముందుకు కదలడం లేదని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి వెనుక కేటీఆర్ ఉండి రాజకీయ కుట్రలకు తెరలేపుతున్నారని, ఆ ఆరోపణలను ఆయన నిజం చేస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసినప్పుడు కిషన్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటారని ఆయన నిలదీశారు. ఇప్పుడు మెట్రో ప్రాజెక్టు విషయంలో జరుగుతున్న రాజకీయ క్రీడకు కిషన్ రెడ్డి బాధ్యత వహించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ఇటువంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. నిధుల విడుదలకు సంబంధించి కిషన్ రెడ్డిపై తమకు గౌరవం ఉన్నప్పటికీ, ఆయన వ్యవహారశైలి మాత్రం బాధాకరంగా ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. 122 కిలోమీటర్ల మెట్రో రెండో దశ ప్రాజెక్టులో కేంద్రం భాగస్వామ్యం తీసుకుంటుందా లేదా అనేది ఆయన తేల్చి చెప్పాలని కోరారు. ఒకవేళ కేంద్రం భాగస్వామ్యం వద్దు అనుకుంటే, తక్షణమే ఎన్‌వోసీ జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలా చేస్తే రాష్ట్ర ప్రభుత్వమే సొంత వనరులతో మెట్రో రెండో దశ నిర్మాణాన్ని పూర్తి చేసుకుంటుందని రేవంత్ రెడ్డి ప్రకటించారు. కిషన్ రెడ్డి తన వైఖరి మార్చుకుని ప్రాజెక్టుకు సహకరించాలని ఆయన హితవు పలికారు. మెట్రో రెండో దశ హైదరాబాద్ భవిష్యత్తుకు అత్యంత కీలకం కాబట్టి రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు.

**మొదటిపేజీ తరువాయి**

ప్రపంచంలోని మొత్తం చమురు వాణిజ్యంలో దాదాపు ఐదో వంతు అంటే 20 శాతం ఈ మార్గం గుండానే సాగుతోంది. దీనికి ఏమాత్రం అంతరాయం కలిగినా ఆయిల్ ధరలు, షిప్పింగ్ ఖర్చులు ఆకాశాన్ని అంటుతాయి. ఈ ఒప్పందం ప్రకారం ఇరాన్ ఈ మార్గాన్ని కమర్షియల్ షిప్పింగ్ కోసం తెరుస్తుంది. అమెరికా ఇరాన్ పోర్టులపై ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తుంది. దీనివల్ల భారీగా క్రూడ్ ఆయిల్ దిగుమతులపై ఆధారపడే భారతదేశం లాంటి దేశాలకు ఇది పెద్ద ఊరట లభించనుంది. ఆయిల్ ఫ్లో పునరుద్ధరణ వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొంత ఊరట కలుగుతుంది. ఆర్థిక పరమైన ఆంక్షల సడలింపు ఈ డీల్‌లో మరో ప్రధాన అంశం. ఇరాన్‌ను తిరిగి చర్చల టేబుల్ దగ్గరకు తీసుకురావడంలో ఈ ఆఫర్ పెద్ద పాత్ర పోషించింది. చర్చలు కొనసాగుతున్నంత కాలం అమెరికా ఎలాంటి కొత్త ఆంక్షలు విధించదు. ఇరాన్ ఆయిల్ ఎగుమతులకు తాత్కాలిక అనుమతులు ఇస్తుంది. విదేశాల్లో ఫ్రీజ్ అయిన బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను అమెరికా రిలీజ్ చేస్తుంది. ఇలా రిలీజ్ అయ్యే ఫండ్స్ దాదాపు 25 బిలియన్ డాలర్లు ఉండొచ్చని అంచనా. ఈ నిధులు ఇరాన్ ప్రభుత్వానికి ఆర్థికంగా తక్షణ బూస్ట్ ఇస్తాయి. సుమారు 300 బిలియన్ డాలర్ల రీకన్‌స్ట్రక్షన్, ఎకనమిక్ డెవలప్‌మెంట్ ప్యాకేజీ గురించి కూడా సమాచారం అందుతోంది, అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అమెరికాఇరాన్ సంబంధాల్లో న్యూక్లియర్ ఇష్యూ అత్యంత సున్నితమైనది. తమ న్యూక్లియర్ ప్రోగ్రామ్ కేవలం పౌర అవసరాల కోసం

# యుద్ధం ఆగింది..!



మాత్రమేనని ఇరాన్ చెబుతుండగా, అమెరికా దాని మిత్రదేశాలు ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తోందని ఆరోపిస్తున్నాయి. ఈ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం ఇరాన్ కొత్తగా అణ్వాయుధాల తయారీకి ప్రయత్నించదు, యురేనియం ఎన్‌రిచ్‌మెంట్‌ను ఆపివేస్తుంది. అలాగే కొత్త న్యూక్లియర్ ఫెసిలిటీలను విస్తరించదు. దీనికి బదులుగా 60 రోజుల పాటు ఇరుదేశాలు తనిఖీలు, ఆంక్షల ఎత్తివేత, ఇరాన్ యురేనియం నిల్వలపై సుదీర్ఘంగా చర్చలు జరుపుతాయి. ఈ ప్రక్రియలో అంతర్జాతీయ ఏజెన్సీల పర్యవేక్షణ కూడా కీలకంగా మారనుంది. అమెరికా కానీ, ఇరాన్ కానీ ఈ డ్రాఫ్ట్ పూర్తి వివరాలను అధికారికంగా బయట పెట్టలేదు. కానీ ఇరాన్ మీడియా కథనాల ప్రకారం 14 పాయింట్లలో దాడులు, యుద్ధ వాతావరణానికి తక్షణ ముగింపు, వాణిజ్య నౌకల కోసం స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ ఓపెనింగ్, ఇరాన్ పోర్టులపై ఆంక్షల ఎత్తివేత ఉన్నాయి. చర్చల సమయంలో కొత్త ఆంక్షలు ఉండవు, ఇరాన్ చమురు ఎగుమతులకు తాత్కాలిక మినహాయింపులు, ఫ్రీజ్ అయిన ఆస్తుల విడుదల, 60 రోజుల చర్చల విండో ఉన్నాయి. అణ్వాయుధాలను తయారు చేయబోమని ఇరాన్ హామీ, యురేనియం ఎన్‌రిచ్‌మెంట్ నిలిపివేత, న్యూక్లియర్ ఫెసిలిటీల విస్తరణపై ఫ్రీజ్, యురేనియం నిల్వల భవిష్యత్తుపై చర్చలు, ప్రాంతీయంగా ఉద్రిక్తతల తగ్గింపు, ఆర్థిక, పునర్నిర్మాణ సంబంధిత చర్చలు, పూర్తిస్థాయి సమగ్ర ఒప్పందంపై చర్చలు ఉన్నాయి. ఇరాన్‌లోని అధికార వర్గాలతో పాటు అమెరికాలోని డెమొక్రాటిక్ పార్టీ నాయకత్వం కూడా ఈ డీల్‌ను నిశితంగా గమనిస్తోంది.

మిడిల్ ఈస్ట్‌లో ఒక పెద్ద యుద్ధాన్ని, గ్లోబల్ ఎనర్జీ క్రైసిస్‌ను, ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితిని ఒకేసారి అడ్రస్ చేయడానికి ఈ ఫ్రేమ్‌వర్క్ ప్రయత్నిస్తోంది. దశాబ్దాలుగా శత్రుత్వంతో ఉన్న రెండు దేశాలు ఘర్షణ నుండి చర్చల వైపు అడుగులేయడం చరిత్రాత్మకం. ఈ ఒప్పందం ద్వారా చమురు ఉత్పత్తిలో అస్థిరత తగ్గుతుంది, ఇది ప్రపంచవ్యాప్త ఇంధన ధరల నియంత్రణకు దోహదపడుతుంది. ముడి చమురు ధరలలో వచ్చే హెచ్చుతగ్గులు భారత వంటి దేశాల ద్రవ్యోల్బణంపై నేరుగా ప్రభావం చూపుతాయి. కాబట్టి ఈ దౌత్యపరమైన బ్రేక్‌త్రూ అటు రాజకీయంగా, ఇటు ఆర్థికంగా అత్యంత కీలకం. ప్రాంతీయ భద్రతకు సంబంధించి ఇరుదేశాలు పరస్పరం కొన్ని హామీలు ఇచ్చే అవకాశం ఉంది. ఈ డ్రాఫ్ట్ అగ్రిమెంట్ ప్రస్తుతానికి తక్షణ సంక్షోభానికి ముగింపు పలికినా, అసలైన సవాళ్లు ఆ 60 రోజుల చర్చల్లోనే ఉన్నాయి. ఈ డీల్ సక్సెస్ అనేది మూడు విషయాలపై ఆధారపడి ఉంటుంది. దాడులు నిజంగా ఆగిపోతాయా, స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్‌లో సాధారణ వాణిజ్యం మొదలవుతుందా, న్యూక్లియర్ చర్చలు ఒక శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తాయా అనేవి ప్రధాన ప్రశ్నలు. ఈ కండిషన్స్ అన్నీ నెరవేరితే, ఈ 14 పాయింట్ల ఫ్రేమ్‌వర్క్ గత కొన్నేళ్లలో అమెరికాఇరాన్ మధ్య జరిగిన అతిపెద్ద దౌత్యపరమైన విజయం అవుతుంది. భౌగోళిక రాజకీయాల్లో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించడానికి ఇరు దేశాలు ప్రదర్శించిన రాజీ ధోరణి ఆశాజనకంగా కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ తన ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించుకోవడానికి ప్రయత్నిస్తోంది. అమెరికా తన మిత్రదేశాలతో కలిసి పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పాలని చూస్తోంది. ఆంక్షల వల్ల ఇప్పటికే ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పడింది, కాబట్టి ఈ ఒప్పందం ఆ దేశానికి అవసరం. మరోవైపు అమెరికా పశ్చిమాసియాలో తన సైనిక ఖర్చులను తగ్గించుకోవాలని భావిస్తోంది. ఇరు దేశాల వ్యూహాత్మక ప్రయోజనాలు ఈ ఒప్పందానికి దారితీశాయి. రాబోయే 60 రోజులు ఈ ఒప్పందం అమలుకు అత్యంత కీలకమైన సమయం. చర్చల వేగం, అమలు తీరుపైనే ఒప్పందం భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అంతర్జాతీయ సమాజం ఈ పరిణామాలను ఎంతో ఆసక్తిగా గమనిస్తోంది. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వేదికలపై కూడా ఈ ఒప్పందంపై సానుకూల స్పందన వచ్చే అవకాశం ఉంది. గ్లోబల్ మార్కెట్లు కూడా ఈ వార్తలతో కాస్త స్థిరపడే సూచనలు ఉన్నాయి. ఎనర్జీ మార్కెట్లలో నెలకొన్న ఆందోళన తగ్గుముఖం పట్టింది. సుమారు 85 శాతం గ్లోబల్ సప్లై చైన్ ఈ ప్రాంతంలోని షిప్పింగ్ మార్గాలపై ఆధారపడి ఉంది కాబట్టి, ఈ జలమార్గం సురక్షితంగా ఉండటం ప్రపంచ దేశాలకు ఎంతో ముఖ్యం. సవాళ్లు ఎదురైనప్పటికీ, చర్చల మార్గమే ఉత్తమమని ఇరు దేశాలు అంగీకరించడం ఆహ్వానించదగ్గ పరిణామం. చివరిగా ఈ డీల్ గనుక విజయవంతమైతే పశ్చిమాసియా రాజకీయాల్లో ఒక కొత్త శకం మొదలవుతుంది. దశాబ్దాలుగా ఉన్న విద్వేషాలు చర్చల ద్వారా తొలగిపోతాయని ఆశించడం సహజం. అమెరికా తన అగ్రరాజ్య హోదాను ఉపయోగించి శాంతిని నెలకొల్పడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇరాన్ కూడా తన ఆచరణాత్మక వైఖరిని ప్రదర్శించడం గమనార్హం. 14 పాయింట్ల ఫ్రేమ్‌వర్క్ కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలైతే, అది ప్రపంచ శాంతికి గొప్ప సంకేతం కానుంది. భవిష్యత్తులో ఈ తరహా మరిన్ని ఒప్పందాలకు ఇది నాంది పలకాలని ఆశించవచ్చు. 60 రోజుల గడువులో ఇరు దేశాలు తమ వాగ్దానాలను నిలబెట్టుకుంటే, అది మానవాళికి ఎంతో మేలు చేకూరుస్తుంది.

# బడి బస్సుల్లో భద్రత ఎంత?

**మొదటిపేజీ తరువాయి**

నాటికి కేవలం 21 వేల వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. గతేడాదితో పోలిస్తే పరిస్థితి కొంత మెరుగుపడినట్లు కనిపిస్తున్నా, వాస్తవ గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కేవలం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీకే పరిమితమవుతున్నారు. పర్మిట్లు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్ వంటి కనీస భద్రతా సౌకర్యాల పర్యవేక్షణ గాలికి వదిలేశారు. అధికారుల ఏకపక్ష వైఖరి కారణంగా స్కూల్ బస్సుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సంవత్సరం పొడవునా సాగాల్సిన నిఘా ప్రక్రియ కేవలం వారం రోజుల తనిఖీలతోనే ముగిసిపోతోంది. బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికేషన్ ప్రక్రియ ఒక ప్రహసనంగానే నిలిచిపోయింది. ఆ తర్వాత పర్యవేక్షణలో రవాణా శాఖ చూపుతున్న నిర్లక్ష్యం ప్రమాదాలకు దారితీస్తోంది. డ్రైవర్ల అజాగ్రత్త, ఓవర్ స్పీడ్, రాష్ డ్రైవింగ్, ఓవర్‌లోడింగ్, సమయపాలన ఒత్తిడి వంటి అంశాలు నిత్యకృత్యమయ్యాయి. పాతబడిన బస్సులను నడపడం, వాహన నిర్వహణలో లోపాలు విద్యార్థుల భద్రతను ప్రమాదంలోకి నెడుతున్నాయి. అన్ని జిల్లాల్లోని ప్రైవేటు విద్యా సంస్థల బస్సులపై జరిపిన గ్రౌండ్ రిపోర్టులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. వరంగల్ జిల్లాలో డ్రైవర్ల అర్హతపై తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పదేళ్ల అనుభవంతో పాటు పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరి అనే నిబంధనను 70 శాతం స్కూళ్లు విస్మరిస్తున్నాయి. మెదక్ జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించిన 50కి పైగా బస్సులను ఆర్టీఏ అధికారులు సీజ్ చేసినా, యాజమాన్యాలు అడ్డదారుల్లో వాటిని మళ్లీ రోడ్లపైకి తెస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 55 వాహనాలకు ఫిట్‌నెస్ లేదని అధికారులు గుర్తించి సీజ్ చేసినా, కొందరు అవినీతి అధికారులను మచ్చిక చేసుకుని బురిడీ కొట్టిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. కరీంనగర్ జిల్లాలో 15 ఏండ్లు దాటిన తుప్పు పట్టిన బస్సులు రోడ్లపై కనిపిస్తున్నాయి. ఆర్టీఏ అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేయకుండా పైపైన చూసి పర్మిషన్లు ఇస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 20కి పైగా బస్సులను ఇప్పటికే సీజ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. నల్లగొండలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. జిల్లాలోని 1,678 బస్సులలో ఇప్పటివరకు 1,076 వాహనాలకు మాత్రమే పరీక్షలు జరిగాయి. ఇంకా 602 బస్సులు తనిఖీల కోసం వేచి చూస్తున్నాయి. తనిఖీలు పూర్తికాని వాహనాలు విద్యార్థులను మోసుకెళ్లడం విస్మయానికి గురిచేస్తోంది. నిజామాబాద్ జిల్లాలో డ్రైవర్ల నైపుణ్యంపై తీవ్ర చర్చ సాగుతోంది. సగం మందికి మాత్రమే సరైన శిక్షణ ఉండగా, మిగిలిన వారు ఉపాధి కోసం తాత్కాలికంగా చేరిన వారే. డ్రైవర్ల నిర్లక్ష్యం, అనుభవం లేకపోవడం వల్ల గతం లో అనేక ప్రమాదాలు జరిగాయి. విద్యార్థుల ప్రాణాలు గాలిలో దీపంలా మారుతున్నా, యాజమాన్యాలు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నాయి. తనిఖీలు చేసే అధికారులకు, స్కూల్ యజమానులకు మధ్య కుదురుతున్న ఒప్పందాలు ప్రమాదాల తీవ్రతను పెంచుతున్నాయి. భద్రతా ప్రమాణాలు పాటించని బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. రోడ్లపై తిరుగుతున్న స్కూల్ బస్సుల దుస్థితిని గమనిస్తుంటే భయం వేస్తోంది. కిటికీలు ఊడిపోవడం, టైర్లు అరిగిపోవడం, ఇంజిన్ల నుంచి పొగ రావడం వంటి దృశ్యాలు నిత్యం కనిపిస్తున్నాయి. ఫీజుల వసూళ్లలో చూపే చొరవను, వాహనాల నిర్వహణలో యాజమాన్యాలు ఎందుకు చూపడం లేదో అర్థం కావడం లేదు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూలుకు పంపి ఆందోళన చెందాల్సిన దుస్థితి నెలకొంది. నిబంధనలను అమలు చేయడంలో రవాణా శాఖ చూపే నిర్లక్ష్యం, యాజమాన్యాల వ్యాపార ధోరణి కలిసి విద్యార్థుల భద్రతను పణంగా పెడుతున్నాయి. ఒక చిన్న ప్రమాదం జరిగితేనే వ్యవస్థలు మేల్కొంటాయా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఫిట్‌నెస్ టెస్టులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కఠినంగా అమలు చేయాలి. బస్సుల పాతబడిన స్థితిని బట్టి రవాణా శాఖ కఠిన నిబంధనలు రూపొందించాలి. డ్రైవర్ల నియామకంలో కచ్చితమైన అర్హతలను పరిగణనలోకి తీసుకోవాలి. తనిఖీలు చేయాల్సిన అధికారులు కమిషన్లకు అలవాటు పడకుండా, బాధ్యతగా వ్యవహరించాలి. లేనిపక్షంలో ఇలాంటి ఘటనలు పునరావృతమై భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. విద్యార్థుల భద్రతను కాపాడటంలో రాజీ పడకూడదు. స్కూల్ బస్సుల నిర్వహణలో యాజమాన్యాలు పారదర్శకతను పాటించాలి. ప్రతీ బస్సులోనూ కచ్చితమైన భద్రతా పరికరాలు ఉండేలా చూడాలి. డ్రైవర్లకు క్రమం తప్పకుండా శిక్షణ తరగతులు నిర్వహించాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రయాణ సౌకర్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. బస్సుల పరిస్థితిని స్వయంగా తనిఖీ చేసి, లోపాలుంటే యాజమాన్యాలను నిలదీయాలి. పాఠశాలల యాజమాన్యాలు వ్యాపార కోణంలోనే కాకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించినప్పుడే విద్యార్థుల ప్రయాణం సురక్షితంగా మారుతుంది. ప్రభుత్వం కూడా ఈ విషయంలో కఠినమైన చర్యలు చేపట్టాలి. రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ తీరుతెన్నులపై జరుగుతున్న చర్చ, క్షేత్రస్థాయి పరిస్థితులు రవాణా శాఖకు కనువిప్పు కావాలి. కేవలం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కాకుండా, ఏడాది పొడవునా అకస్మాత్తు తనిఖీలు నిర్వహించాలి. నిబంధనలు పాటించని బస్సుల పర్మిట్లను రద్దు చేయాలి. యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల భద్రత విషయంలో రాజీపడకుండా, పకడ్బందీగా నిఘా ఉంచాలి. అప్పుడే ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుంది. విద్యార్థుల భద్రత అనేది ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలకు ప్రధాన ప్రాధాన్యత కావాలి.



## ఆల్విన్ కాలనీ సర్కిల్ 51లో ఉప కమిషనర్ సర్వే

**రోడ్డుపై నిర్మాణ వ్యర్థాలు పడేసిన వారిపై చర్యలు**



**సైబరాబాద్ విశాల భారతి;** ఆల్విన్ కాలనీ సర్కిల్ 51ఉప కమిషనర్ ఇ.చాముండేశ్వరి సోమవారం సర్కిల్ పరిధిలో విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితిని సమీక్షించారు. హెచ్ఎంటి సాతవాహన నగర్ లో డివైడర్ల పక్కన పేరుకుపోయిన ఇసుకను తక్షణం తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అక్కడి నివాస సంక్షేమ సంఘం ప్రతినిధులతో మాట్లాడి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రాంతంలో పేరుకుపోయిన పచ్చని వ్యర్థాల తొలగింపును వేగవంతం చేయాలని సూచించారు.తనిఖీల సందర్భంగా రోడ్డుపై నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలు డంప్ చేసిన యజమానికి జరిమానా విధించారు. ఉప సంచాలకులు, పారిశుద్ధ్య సిబ్బంది, క్షేత్రస్థాయి అధికారులు ఉప కమిషనర్ వెంట ఉన్నారు. రోడ్లపై చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉప కమిషనర్ స్పష్టం చేశారు.

## సైబరాబాద్ ప్రజావాణికి 97 వినతులు

**టౌన్ ప్లానింగ్ సమస్యలే ఎక్కువ**



**సైబరాబాద్ విశాల భారతి;** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. కమిషనర్ జి.శ్రీజన నేరుగా ప్రజల సమస్యలు విని వినతులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 97 వినతులు అందాయి. అందులో అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి 77 అర్జీలు వచ్చాయి. మిగిలిన 20 వినతులు నీరు, పారిశుద్ధ్యం, ఆస్తి పన్ను, ఇతర విభాగాలకు చెందినవి.కమిషనర్ జి. శ్రీజన మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల కార్పొరేషన్ నిబద్ధతను ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది. ప్రజావాణి ద్వారా పాలనను ప్రజలకు దగ్గర చేసే చొరవకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది.

# సింగరేణి రూ.1600కోట్ల మాయం?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



సింగరేణి సంస్థను నల్లబంగారపు గనిగా, కార్మికుల కష్టంతో సిరులు కురిపించే పుణ్యక్షేత్రంగా తెలంగాణ సమాజం చూస్తుంది. దశాబ్దాలుగా ఆ గని ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తోంది. అయితే ప్రస్తుతం ఈ ప్రతిష్ఠాత్మక సంస్థ ఒక సంచలన రాజకీయ చిచ్చుకు వేదికైంది. గనుల్లో సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు మాయమయ్యాయన్న ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. సుమారు 1,600 కోట్ల రూపాయల విలువైన ఈ సంపద అక్రమంగా తరలిపోయిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణలు గుప్పించడంతో పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడి వాదనలతో సింగరేణి ప్రాంగణం రాజకీయ వేదికగా మారిపోయింది. హరీశ్ రావు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు గందరగోళానికి దారితీశాయి. బొగ్గు మాయమైందనే ఆధారాలను ఆయన ప్రదర్శిస్తుంటే, ప్రభుత్వం ఆ క్షేత్రాలను సందర్శించకుండా అడ్డుకోవడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. గనుల్లో బొగ్గు నిల్వలు ఉన్నాయా లేదా అనే ప్రాథమిక సందేహం ప్రజల్లో బలంగా నాటుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకతను పక్కనపెట్టిందని హరీశ్ రావు విమర్శిస్తున్నారు. బొగ్గు నిల్వల లెక్కల్లో స్పష్టత లేకపోవడం వెనుక పెద్ద ఎత్తున కుట్ర జరిగిందని ఆయన ఘాటుగా హెచ్చరిస్తున్నారు. అక్రమ రవాణాను కప్పిపుచ్చేందుకు మట్టికుప్పలను బొగ్గులా చూపిస్తున్నారని ఆయన చేస్తున్న ఆరోపణలు చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యవహారం కేవలం రాష్ట్ర స్థాయికి పరిమితం కాలేదు. సింగరేణిలో 48 శాతం వాటా కలిగిన కేంద్ర ప్రభుత్వం కూడా మౌనంగా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిష్పక్షపాత విచారణ కోసం కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. కానీ కిషన్ రెడ్డి స్పందించిన తీరు దొంగకు తాళం చెవి ఇచ్చిన చందంగా మారిందని హరీశ్ విశ్లేషించారు. రాష్ట్ర ప్రభుత్వానికే విచారణ బాధ్యతలు అప్పగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంపై ఆయన మండిపడుతున్నారు. దోషులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికే దర్యాప్తు అధికారం ఇస్తే నిజాలు ఎలా బయటకు వస్తాయని ఆయన ప్రశ్నిస్తున్నారు. కేంద్రం కూడా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అక్రమాలకు తెరలేపిందని ఆయన అనుమానిస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హరీశ్ రావు ఆరోపణలను పూర్తిగా తిప్పికొట్టారు. సింగరేణి నుంచి ఒక్క కిలో బొగ్గు కూడా అక్రమంగా బయటకు వెళ్లే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ నాయకులు సంస్థను దోచుకున్నారని, గనులను తమకు అనుకూలంగా వాడుకున్నారని భట్టి కౌంటర్ ఇచ్చారు. తాము పారదర్శకంగా పనులు నిర్వహిస్తున్నామని, లేనిపోని అపోహలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. కేవలం గందరగోళం సృష్టించి ఉనికిని చాటుకోవడమే హరీశ్ రావు లక్ష్యమని ఆయన ఆరోపించారు. సంస్థ ప్రతిష్టను దెబ్బతీసే చర్యలను సహించేది లేదని భట్టి హెచ్చరించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాయడంతో ఈ వివాదం మలుపు తిరిగింది. సింగరేణిలో బొగ్గు మాయమైందన్న వార్తలపై ఆందోళన వ్యక్తం చేస్తూ వాస్తవాలను వెలికితీయాలని ఆయన సూచించారు. సింగరేణి ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం సవాలుగా ఉన్న తరుణంలో ఈ ఆరోపణలు సంస్థకు నష్టం కలిగిస్తాయని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్గత నిఘా వ్యవస్థలను పటిష్టం చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిల్వలను పర్యవేక్షించాలని ఆయన కోరారు. అయితే ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్రం చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో ఉన్న సందేహాలను పూర్తిగా నివృత్తి చేయలేకపోతున్నాయి. సింగరేణిలో జిలెటిన్ స్టిక్స్ వినియోగంలోనూ భారీ అక్రమాలు జరిగాయని హరీశ్ రావు మరో కొత్త అంశాన్ని తెరపైకి తెచ్చారు. బొగ్గు స్కామ్‌తో పాటు, పేలుడు పదార్థాల కొనుగోళ్లలో జరిగిన అవకతవకలపై కూడా సమగ్ర విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ప్రతి అడుగులోనూ సంస్థను ఆర్థికంగా దెబ్బతీసే యత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన చెందుతున్నారు. 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైన విషయాన్ని నిరూపించలేకపోతే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఈ సవాల్‌కు ప్రభుత్వం నుండి ఎలాంటి సమాధానం వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. నిరూపణలు సిద్ధంగా ఉన్నాయని ప్రతిపక్షం చెబుతుంటే, అది అవాస్తవమని ప్రభుత్వం కొట్టిపారేస్తోంది. బొగ్గు బ్లాకుల కేటాయింపుల్లో కూడా తీవ్రమైన విమర్శలు చెలరేగాయి. కిషన్ రెడ్డి నిర్ణయాల వల్ల సింగరేణికి సుమారు 2,624 కోట్ల రూపాయల నష్టం జరిగిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి ప్రయోజనాలను పణంగా పెట్టిందని ఆయన విమర్శించారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ సంస్థను బలిపశువును చేస్తున్నారని కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. గనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన ప్రభుత్వాలు రాజకీయ విమర్శలకే పరిమితం కావడం విచారకరం. బొగ్గు రక్షణలో వైఫల్యంపై ఎవరికి వారు బాధ్యతను తప్పించుకునే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. సీబీఐ విచారణ జరిపించాలని హరీశ్ రావు డిమాండ్ చేస్తున్నా, అది అంత తేలికైన వ్యవహారం కాదని నిపుణులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా సీబీఐ రంగంలోకి దిగడం అసాధ్యం. మరోవైపు, కేంద్ర బొగ్గు మంత్రి స్వయంగా రాష్ట్ర ప్రభుత్వానికి విచారణ బాధ్యత అప్పగించడం ద్వారా కేంద్రం కూడా స్వతంత్ర దర్యాప్తుకు సుముఖంగా లేదని స్పష్టమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో నిజనిజాలు బయటకు రావడం కష్టసాధ్యమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వాలు తమ ఆధిపత్య పోరులో సంస్థ ఆర్థిక ప్రయోజనాలను విస్మరిస్తున్నాయని స్పష్టమవుతోంది. రాజకీయ రంగు పులుముకున్న ఈ వ్యవహారంలో బాధితులు మాత్రం సంస్థను నమ్ముకున్న లక్షలాది మంది కార్మికులే. ఈ మొత్తం వ్యవహారంలో రూ.1,600 కోట్ల బొగ్గు నిజంగా మాయమైందా లేక అది కేవలం లెక్కల తేడానా అన్నది ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్న. క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ కొరవడిందనేది వాస్తవం. సాంకేతికత అందుబాటులో ఉన్న నేటి కాలంలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయం కావడం సాధ్యమేనా అనేది ఎవరికీ అర్థం కాని పరిస్థితి. సంస్థలో పనిచేసే అధికారుల నిర్లక్ష్యం ఉందా లేక రాజకీయ అండదండలతో అక్రమాలు జరుగుతున్నాయా అనే విషయాలు నిగ్గు తేలాలి.

# కాంగ్రెస్‌తోనే సింగరేణికి అన్యాయం

**మొదటిపేజీ తరువాయి**




కార్మిక క్షేత్రం కుదేలవుతోందని, కార్మికుల ప్రయోజనాలను పణంగా పెట్టి సంస్థను ప్రైవేటీకరించేందుకు కుట్రలు సాగుతున్నాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గుజరాత్ తరహాలో మినరల్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసుకుంటేనే సంస్థకు మనుగడ ఉంటుందని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ బిడ్డగా సింగరేణికి కొత్త బ్లాక్‌లను దక్కేలా చూసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల కార్మికులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమని, ఆఫీసర్లకు ఒకలాంటి నిబంధనలు, కార్మికులకు మరోలాంటి కఠినమైన ఆంక్షలు అమలు చేస్తూ వేధింపులకు గురిచేయడం అత్యంత దారుణమని ఆమె విమర్శించారు. లేబర్ కోడ్ చట్టాల అమలును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, వీటిని అడ్డుకునేలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఓపెన్ కాస్ట్ మైనింగ్ పేరుతో కార్మికుల సంఖ్యను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాస్తవానికి అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను ప్రోత్సహిస్తేనే ఎక్కువమంది యువతకు ఉపాధి దొరుకుతుందని, సంస్థకు కూడా దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని ఆమె స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం తన కనుసన్నల్లోనే సింగరేణి కార్యకలాపాలు సాగాలని భావించడం, బాధ్యత గల పదవుల్లో ఉన్నవారు కార్మికుల వద్దకు వచ్చి నాటకీయంగా వ్యవహరించడం సమంజసం కాదని ఆమె తప్పుబట్టారు. సింగరేణిలో ప్రతి శనివారం ఉద్యోగాల జాతర నిర్వహించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా ఎంతమందిని సస్పెండ్ చేయాలా అని యాజమాన్యం ఆలోచించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కవిత మండిపడ్డారు. సంస్థకు చెల్లించాల్సిన బకాయిలు సకాలంలో చెల్లించి ఉంటే నేడు పరిస్థితి ఇంతటి దయనీయంగా ఉండేది కాదని, రాజకీయ జోక్యం పెరిగిపోవడం వల్ల సంస్థ మూలాలను కోల్పోతోందని ఆమె ఆరోపించారు. మైన్ డెవలప్‌మెంట్ విధానం పేరుతో జరుగుతున్న తతంగాన్ని నిరసిస్తూ, ఎండీవో పద్ధతిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిజాం రాజుల కాలం నుండి తెలంగాణ ప్రజల ఆస్తిగా ఉన్న బొగ్గు గనులను అపవిత్రం చేసే హక్కు ఎవరికీ లేదని, కాంగ్రెస్ నేతలు సాగిస్తున్న కుంభకోణాల వల్ల భవిష్యత్ తరాలు బొగ్గు గనుల కోసం కళ్లు కాయలు కాసేలా చూడాల్సిన పరిస్థితి దాపురిస్తుందని ఆమె హెచ్చరించారు. సత్తుపల్లి కోల్ మైన్స్ విషయంలో జరుగుతున్న పరిణామాలు సింగరేణికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని, కేంద్రం జాతీయం చేసిన బ్లాక్‌లను తిరిగి మనకు దక్కేలా కేంద్రమంత్రి చొరవ చూపాలని ఆమె కోరారు. బిజెపి అధికారంలోకి రావడం కల్ల అని తెలిసినప్పటికీ, వారు అనుసరిస్తున్న వినాశకర విధానాలను కార్మికులు గమనించాలని సూచించారు. ఐటీ మినహాయింపు అంశంపై తప్పుడు హామీలు ఇవ్వడం మానుకోవాలని, కార్మికుల ఐక్యతను దెబ్బతీసే రీతిలో ఏఐటీయూసీ చేస్తున్న సమ్మెల వెనుక ఉన్న అసలు కారణాలను బయటపెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. గతంలో జనరల్ మేనేజర్ల స్థాయిలోనే పరిష్కారమయ్యే పోస్టుల భర్తీని నేడు ముఖ్యమంత్రి స్థాయికి తీసుకెళ్లడం అంటే, వ్యవస్థను ఎంతలా భ్రష్టు పట్టించారో అర్థం చేసుకోవచ్చని ఆమె ఎద్దేవా చేశారు. సింగరేణి కార్మికులకు సొంత గూడు కల్పించడం అత్యంత అవసరమని, వారి కోసం ప్రత్యేకంగా 250 గజాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డును నెలకు రెండుసార్లు ఏర్పాటు చేసి, కార్మికుల ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు అందాల్సిన వేతనాల్లో గతంలో ఇచ్చిన వాటా కంటే రూ. 10 వేలు అదనంగా చెల్లించి వారికి ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. అలియాస్ నేమ్స్ విషయంలో కార్మికులను వేధించడం ఆపి, వారికి సామాజిక న్యాయం చేయాలని ఆమె స్పష్టం చేశారు. కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా నియామక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఆమె సూచించారు. విజిలెన్స్ పేరుతో సాగుతున్న వేధింపులను అరికట్టాలని, పదో తరగతి పాస్ కావాలనే నిబంధనను కార్మిక రంగంలో పెట్టడం హాస్యాస్పదమని ఆమె విమర్శించారు. డిస్మిసల్ కార్మికుల వారసుల ఉద్యోగాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లు కల్పించడంలో జరుగుతున్న జాప్యం కార్మికులను నిరాశకు గురిచేస్తోందని, సూపర్ వైజర్లను ఈ2 కేటగిరీలోకి మార్చి వారికి రావాల్సిన పదోన్నతులను వెంటనే అమలు చేయాలని కవిత స్పష్టం చేశారు. జనరల్ అసిస్టెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టడం వల్ల యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆమె తెలిపారు. క్లర్క్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసి తొమ్మిది నెలలు గడుస్తున్నా పరీక్ష నిర్వహించకపోవడం ప్రభుత్వ అలసత్వానికి నిదర్శనమని ఆమె ఆరోపించారు. యువతకు పరిశ్రమలు పెట్టేందుకు రూ. 2 లక్షల నుండి రూ. 20 కోట్ల వరకు రుణాలు మంజూరు చేసి, సింగరేణిలో మెషీన్ల రిపేర్ పనులను స్థానికులకు అప్పగిస్తే నిరుద్యోగ సమస్య కొంతవరకు తీరుతుందని ఆమె పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని నష్టాల్లో ఉన్న సంస్థతో కలిసి సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడం వెనుక ఆంతర్యమేమిటో ప్రజలకు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. అదే సోలార్ ప్లాంట్‌ను మన ప్రాంతంలోనే ఏర్పాటు చేసి సింగరేణికి లాభాలు చేకూర్చవచ్చని, ఇక్కడ ఉన్న ప్రాజెక్టులను వదిలి ఇతర రాష్ట్రాలకు నిధులు తరలించడం దారుణమని ఆమె మండిపడ్డారు. సింగరేణి సొమ్మును ముఖ్యమంత్రి తన సరదాల కోసం, ఫుట్‌బాల్ మ్యాచ్‌ల కోసం ఖర్చు చేయడం కార్మికుల కష్టాన్ని అవమానించడమేనని ఆమె ఆరోపించారు. డీజిల్ కుంభకోణంపై ఇప్పటికే ఎన్ని ఆధారాలు చూపినా ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక ఉన్న చీకటి ఒప్పందాలను ప్రజలకు వివరించాలని ఆమె డిమాండ్ చేశారు. లిథియం అయాన్ బ్యాటరీ సంస్థ పేరుతో రూ. 10 లక్షల విలువ లేని కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవడం అవినీతి పరాకాష్ట అని, ఆ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు ప్రాంతాన్ని బట్టి వేర్వేరు వేతనాలు ఇవ్వడం వివక్ష కాదా అని ఆమె ప్రశ్నించారు. గోదావరిఖని, రామగుండం ప్రాంతాల్లో ఎమ్మెల్యేల ఒత్తిడి మేరకు వేతనాలు పెరిగినా, మంచిర్యాల ప్రాంత కార్మికులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ప్రాంతాల కార్మికులకు సమాన వేతనం, సమాన గౌరవం లభించాలని ఆమె డిమాండ్ చేశారు. తాళ్లపల్లిలో సింగరేణి కోసం భూములిచ్చిన కుటుంబాలకు పరిహారం అందలేదని, వారికి పర్మినెంట్ ఉద్యోగాలివ్వాలని ఆమె కోరారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ కార్మికులకు తక్కువ వేతనాలు అందుతున్నాయని, ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం రైలు ఆగాల్సిన అవసరం ఉందని, స్థానిక ఎంపీ ఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె నిలదీశారు. సింగరేణి ప్రాంత ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేస్తే, ఆ పార్టీ నాయకులు నిలువునా మోసం చేస్తున్నారని, కనీసం గోదావరి నదికి కరకట్ట కూడా నిర్మించలేకపోయారని ఆమె ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె మండిపడ్డారు.

# అభిజీత్ దిప్కే చెంప చెల్లు

**మొదటిపేజీ తరువాయి**



పాల్పడటం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. సభను ఉద్దేశించి ప్రసంగించేందుకు ఆయన వేదిక వద్దకు వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరగడం పట్ల నిరసనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైరల్ అవుతున్న వీడియో ఫుటేజ్ ప్రకారం, తన మద్దతుదారుల భుజాలపై ఎక్కి సభా ప్రాంగణంలోకి ఉత్సాహంగా వస్తున్న అభిజీత్ పై ఒక్కసారిగా దుండగుడు విరుచుకుపడ్డాడు. ఆ వ్యక్తి తొలుత ఆయన స్కార్ఫ్ పట్టుకుని కిందకు లాగే ప్రయత్నం చేయగా, ఆ వెంటనే వరుసగా 4 సార్లు చెంపపై కొట్టాడు. ఈ ఊహించని పరిణామంతో అక్కడ ఉన్నవారంతా ఒక్కసారిగా నివ్వెరపోయారు. వెంటనే అప్రమత్తమైన కార్యకర్తలు ఆ వ్యక్తిని చుట్టుముట్టి చితకబాదే ప్రయత్నం చేశారు. గందరగోళం పెరుగుతున్న తరుణంలో అభిజీత్ స్వయంగా జోక్యం చేసుకుని, సదరు వ్యక్తిపై భౌతిక దాడి చేయొద్దని మద్దతుదారులను శాంతింపజేశారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విద్యా రంగంలో వైఫల్యం చెందిందని, నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ గట్టిగా డిమాండ్ చేస్తోంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆ పార్టీ ఆరోపిస్తోంది. జైపూర్ నిరసన కోసం పోలీసులు మొదట అనుమతి నిరాకరించినప్పటికీ, చివరకు 800 మంది మాత్రమే పాల్గొనాలని షరతులతో కూడిన పర్మిషన్ ఇచ్చారు. ఈ ఉద్యమానికి దేశవ్యాప్తంగా పెరుగుతున్న మద్దతు అధికార వర్గాలను కలవరపెడుతోంది. ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సైతం ఈ నిరసనకు సంఘీభావం తెలపడం విశేషం. ఒకవేళ అభిజీత్‌ను అరెస్ట్ చేస్తే 42 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తానని ఆయన ప్రకటించడం ఉద్యమానికి కొత్త బలాన్నిచ్చింది. ఇప్పటికే ఢిల్లీ, పుణె, బెంగళూరు, హైదరాబాద్, లక్నో వంటి నగరాల్లో వేలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి తమ నిరసన గళాన్ని వినిపిస్తున్నారు. 93 శాతం కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన చెందుతున్న విద్యార్థులు, వ్యవస్థల్లో మార్పు కోసం ఉద్యమిస్తున్నారు. జైపూర్ దాడి ఘటనపై అభిజీత్ దిప్కే ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. భౌతిక దాడులు భయానికి, పిరికితనానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తాను గాంధీ, అంబేద్కర్‌ల మార్గంలో నడిచేవాడినని, ఎన్ని దాడులు చేసినా శాంతి, ప్రేమతోనే పోరాటాన్ని కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన వ్యవస్థను ప్రశ్నిస్తున్నందుకు తమను అణిచివేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు అప్రజాస్వామికమని ఆయన విమర్శించారు. నిరసనకారులను అణగదొక్కడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ ఉద్యమం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపిస్తున్న వారు, నిందితుల మతం, కులం ఆధారంగా స్పందిస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. బండి భగీరథ్ కేసులో నిందితుడికి అండగా నిలిచిన శక్తులే, ఇప్పుడు కూడా తమకు నచ్చని వారిపై దాడులు చేయిస్తున్నాయని సీజేపీ కార్యకర్తలు మండిపడుతున్నారు. వ్యవస్థలను అడ్డం పెట్టుకుని నిరసనలను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని, కానీ తమ లక్ష్యం మాత్రం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే అని వారు తేల్చిచెప్పారు. 17 ఏళ్ల విద్యార్థిని యాంటీ నేషనల్‌గా చిత్రీకరించడం వంటి చర్యలు ఎంతమాత్రం సమర్థనీయం కాదని వారు ఆవేదన చెందారు. ప్రస్తుతం దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అధికారికంగా 2078కి పైగా పోక్సో కేసులు నమోదవుతుంటే, విద్యా రంగంలో జరిగిన అవకతవకల జాబితా కూడా వేలల్లోనే ఉంది. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు సామాన్యుడిని, విద్యార్థిని నిత్యం కష్టాల్లోకి నెడుతున్నాయని ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. నిరసనల ద్వారా వ్యవస్థలను కదిలించాలని చూస్తుంటే, దాడులు చేయడం ద్వారా పౌర హక్కులను కాలరాస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జైపూర్ ఘటన తర్వాత పోలీసుల తీరుపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిందితుడిని అదుపులోకి తీసుకున్నప్పటికీ, భద్రతా వైఫల్యంపై పోలీసుల నుంచి ఎలాంటి వివరణ రాలేదు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కూడా నిరసన నిర్వహించేందుకు సీజేపీ సన్నాహాలు చేస్తోంది. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ లక్ష్యమని, దీనికోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. నిరసన ప్రదేశాల్లో భారీగా భద్రతను పెంచినప్పటికీ, విద్యార్థుల ఆవేదనను ఆపడం సాధ్యం కాదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని కాక్రోచ్ జనతా పార్టీ మరోసారి గుర్తుచేస్తోంది. విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన చేస్తున్న ఈ పోరాటం కేవలం ఒక పార్టీది మాత్రమే కాదని, ఇది దేశవ్యాప్తంగా ఉన్న యువత గొంతుక అని వారు చెబుతున్నారు.

# శంషాబాద్‌లో డ్రగ్స్ దందాపై పోలీసుల దాడి

- గుట్కా గోదాములు బహిర్గతం.. నిషేధిత గుట్కా విక్రయాలపై ఉక్కుపాదం
- శంషాబాద్‌లో పోలీసుల సుడిగాలి తనిఖీలు.. డ్రగ్స్, గుట్కా దందాపై కఠిన చర్యలు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్ డ్రగ్స్ నియంత్రణలో భాగంగా పోలీసులు దూకుడు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో శంషాబాద్ పోలీసులు మరియు ఈగిల్ టీం నార్కోటిక్ డ్రగ్ విభాగం సంయుక్తంగా సోమవారం పాలమాకుల, కవేలీగూడ, ముచ్చింతల గ్రామాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. గ్రామాల పరిధిలోని కిరాణా దుకాణాలు, పాన్ షాప్‌లలో గంజా, నిషేధిత టోబాకో ఉత్పత్తులు, గుట్కా వంటి మత్తు పదార్థాల విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో భాగంగా కవేలీగూడ గ్రామంలోని ఎస్‌కే పాన్ షాప్, తవక్కల్ పాన్ షాప్‌లలో పెద్ద ఎత్తున నిషేధిత టోబాకో మరియు గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిషేధిత పదార్థాలను అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలు సమాజానికి హానికరమని, ముఖ్యంగా యువతపై దుష్ప్రభావం చూపుతున్నాయని అధికారులు తెలిపారు. అలాగే భవిష్యత్తులో కూడా ఈ తరహా తనిఖీలు మరింత కఠినంగా కొనసాగిస్తామని, ఎక్కడైనా నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలు గమనించినట్లయితే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతో మత్తు పదార్థాల నియంత్రణ సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

# అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ



**రాజేంద్రనగర్, విశాలభారతి:** మందువ ఫౌండేషన్ అధ్యక్షులు మందువ మధుసూదన్ శర్మ గారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో, పవిత్రమైన మరియు విశిష్టమైన అధిక జ్యేష్ఠ మాస సోమవత్తి అమావాస్య సందర్భంగా సోమవారం రోజు మణికొండలోని మర్రి చెట్టు సమీపంలో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో భక్తి, శ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేసి, అనంతరం దాదాపు 100 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా కార్యక్రమంలో స్థానిక భక్తులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ, ఇటువంటి ధార్మిక మరియు సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు భక్తి భావాన్ని మరింతగా పెంచుతాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని వారు వెల్లడించారు.

# ఓటు మన హక్కు

- బిఆర్ఎస్ పార్టీ మాజీ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ జింకల మల్లేష్




**ముషీరాబాద్,విశాల భారతి:** ఓటు హక్కు మన హక్కు అని బిఆర్ఎస్ పార్టీ మాజీ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ జింకల మల్లేష్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపు నంబర్ 6 లోని బూతు నెంబర్లు218,219,220 లో కేటీఆర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు సర్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జింకల మల్లేష్ హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించి తమ ఓటు ఉందో లేదో తెలుసుకొని లేకుంటే నమోదు చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు చాలా ముఖ్యమని ఓటు లేకుంటే మనకు గుర్తింపు ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండి కాజా పాషా, యాకూబ్ షరీఫ్,ముజీహిద్, అరుణ్ కుమార్,సబర్, వరికుప్పల శ్యామ్, జాకీర్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, ఇషాక్, అలీ, ఫయాక్ తో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూడికలు, మూసిన స్లాబులు

- వరద ముప్పులో జూబ్లీ గార్డెన్స్.. పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



**మూసుకుపోయిన కాలువను పరిశీలిస్తున్న హైడ్రా కమీషనర్ రంగనాథ్**

**సైబరాబాద్ విశాల భారతి:** కాలువలు పూడుకుపోవడం, స్లాబులు మూసేయడంతో కొండాపూర్ జూబ్లీ గార్డెన్స్ ప్రాంతం వరద ముప్పులో చిక్కుకుంది. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ట్రాఫిక్ జాయింట్ సీపీ డి. జోయెల్ డేవిస్ ఆదివారం పరిసరాల్లో పర్యటించారు. బొటానికల్ గార్డెన్స్, శ్రీరామ్ నగర్, పోలీసు బెటాలియన్ నుంచి వచ్చే నీరు మీనాక్షి టవర్స్ వద్ద మొండి కుంట ద్వారా ముల్లకత్వా చెరువుకు వెళ్లాలి. కానీ వందల మీటర్ల స్లాబులు, పూడికతో ప్రవాహం ఆగి జూబ్లీ గార్డెన్స్ ముంపునకు గురవుతోంది. మీనాక్షి అపార్ట్‌మెంట్స్ వద్ద 2.15 మీటర్ల కాలువను 1.5 మీటర్లకు కుంచించడంతో సమస్య మరింత తీవ్రమైందని అధికారులు గుర్తించారు. శనివారం నుంచి స్లాబులు తొలగించి డీసిల్టింగ్ పనులు మొదలయ్యాయి. డీసిల్టింగ్ తర్వాత ఓపెన్ కాలువలపై గ్రిల్స్ ఏర్పాటు చేసి ప్రతి 3 మీటర్లకు తనిఖీ కోసం స్థలం ఉంచాలని కమిషనర్ ఆదేశించారు.వారం రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపాలని హైడ్రా, ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖలకు ఆదేశాలు ఇచ్చారు.

# మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సాయం

- అందజేసిన బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి



**ముషీరాబాద్,విశాల భారతి:** ఇటీవల మృతి చెందిన విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మలైన అల్లోజు మహేష్, బత్తు సంపత్ కుటుంబాలను బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. జనగాం లోని విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయం ఆవరణలో జిల్లా అధ్యక్షులు నరసింహ చారి, సాంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లబోజు నరసింహ చారి తో కలిసి గణేష్ చారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఎంతో సేవ చేస్తున్న విశ్వబ్రాహ్మణులు ఆకస్మిక మృతి చెందడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘాలు ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం వచ్చే విధంగా కృషి చేయాలని అలానే సంఘాలు కూడా తోడ్పాటును అందించాలని కోరారు. ఆర్థిక సాయం అందజేయడం లో విశ్వబ్రాహ్మణ సంఘం ముందుకు రావడం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనంత బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ మరణాల్లో తెలంగాణ టాప్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గడ్డపై కిడ్నీ వ్యాధుల మరణ మృదంగం ఆందోళన కలిగిస్తోంది. దేశంలోనే మరే ఇతర రాష్ట్రంలో లేనంత తీవ్రస్థాయిలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులు ఇక్కడ ప్రజల ప్రాణాలను కబళిస్తున్నాయి. 'ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' పత్రికలో వెలువడిన తాజా పరిశోధనాత్మక నివేదిక వెలుగులోకి తెచ్చిన వాస్తవాలు విస్తుగొలుపుతున్నాయి. భారత వైద్య పరిశోధన మండలి ఐసీఎంఆర్ వేదికగా వెలువడిన ఈ అధ్యయనం మన రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థ ముందున్న సవాళ్లను కళ్లకు కట్టినట్లు చూపుతోంది. ప్రతి లక్ష మంది జనాభాలో సగటున 19.84 మరణాలు నమోదవుతుండటం తెలంగాణలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పకనే చెబుతోంది. జాతీయ సగటుతో పోలిస్తే ఈ సంఖ్య బహు రెట్లు ఎక్కువగా ఉండటం విశ్లేషకులను సైతం కలవరపరుస్తోంది. దేశ రాజధాని ఢిల్లీకి చెందిన ప్రముఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ వైద్య నిపుణుల బృందం ఈ విషమ పరిస్థితిపై లోతైన అధ్యయనం చేపట్టింది. 1990 నుంచి 2023 వరకు సుదీర్ఘకాలపు 'గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్' గణాంకాలను ఈ పరిశోధకులు క్షుణ్ణంగా విశ్లేషించారు. దేశవ్యాప్తంగా వివిధ



రాష్ట్రాల్లో వ్యాధి విస్తృతిని బేరీజు వేస్తూ సేకరించిన సమాచారం దిగ్భ్రాంతికరమైన విషయాలను బయటపెట్టింది. దేశంలోనే అత్యల్పంగా రాజస్థాన్‌లో ప్రతి లక్ష మందికి కేవలం 6.71 మరణాలు సంభవిస్తుండగా తెలంగాణలో ఈ సంఖ్య పతాక స్థాయికి చేరడం గమనార్హం. ప్రతి లక్ష మందిలో 10,601 మంది దీర్ఘకాలిక కిడ్నీ సమస్యలతో సతమతమవుతున్నారని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో ప్రజలు ఆరోగ్యకరమైన జీవితకాలాన్ని కోల్పోవడంలో కూడా అగ్రస్థానంలో నిలుస్తున్నారని అధ్యయనం వెల్లడించింది. అకాల మరణాలు, రోగగ్రస్త జీవనం వల్ల సామాజిక, ఆర్థికాంశాలపై చూపే ప్రభావం అపారమైనది. యువత నుంచి వృద్ధుల వరకు ఈ వ్యాధి బారిన పడుతుండటంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. వ్యాధి ప్రాథమిక దశలోనే గుర్తింపునకు నోచుకోకపోవడం వల్ల రోగులు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గృహిణులు, రైతులు, కార్మికులు ఇలా సామాన్య వర్గాలే అధికంగా ఈ మహమ్మారికి గురవుతుండటం గమనించాల్సిన అంశం. వ్యాధి లక్షణాలు బయటపడే సమయానికి కిడ్నీలు పూర్తిగా విఫలమై చికిత్సకు లొంగని స్థితికి చేరుకుంటున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో కిడ్నీ వ్యాధుల తీవ్రతకు అదుపులేని మధుమేహమే ప్రధాన కారణమని పరిశోధన బృందం నిర్ధారించింది. దేశవ్యాప్తంగా కిడ్నీ సమస్యలకు డయాబెటిస్ బాధ్యత 18% నుంచి 24% లోపు ఉండగా మన రాష్ట్రంలో ఈ శాతం అత్యధికంగా నమోదైంది. రక్తంలో చక్కెర స్థాయిలు నిరంతరం పెరిగిపోతుండటం వల్ల మూత్రపిండాల పనితీరు క్రమంగా మందగిస్తోంది. వ్యాధి నియంత్రణలో నిర్లక్ష్యం వహించడం, వైద్య సలహాలను పాటించకపోవడం వంటి అంశాలు మరణాల సంఖ్యను పెంచుతున్నాయి. షుగర్ వ్యాధి ఉందని తెలిసినా సకాలంలో సరైన చికిత్స తీసుకోకపోవడం, జీవనశైలి మార్పులకు దూరంగా ఉండటం కిడ్నీ వైఫల్యానికి దారితీస్తోంది. దిగువ మధ్యతరగతి, పేద వర్గాలకు వైద్య సేవలు అందని ద్రాక్షలా మారడం మరో పెద్ద సమస్యగా మారింది. వ్యాధి ప్రాథమిక దశలో ఎటువంటి స్పష్టమైన లక్షణాలు కనిపించవు కాబట్టి ప్రజలు అప్రమత్తం కావడం లేదు. మూత్ర పరీక్షలు, రక్త పరీక్షల ద్వారా కిడ్నీ పనితీరును తెలుసుకునే అవకాశాలు ఉన్నా అవగాహన లోపంతో వాటిని పట్టించుకోవడం లేదు. ఆసుపత్రికి వెళ్లే సమయానికి జబ్బు ముదిరిపోయి డయాలసిస్ తప్పనిసరి అవుతోంది. డయాలసిస్ సేవలు అందరికీ అందుబాటులో ఉండకపోవడం, ఖరీదైన చికిత్సలు భరించలేక రోగులు అర్ధాంతరంగా మృత్యువు ఒడిలోకి చేరుకుంటున్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆరోగ్య సమస్యగా గుర్తించాల్సిన అవసరం ఏర్పడింది.

# ఏకో టౌన్ (డంపింగ్ యార్డు) ప్రాజెక్టుపై ప్రజాగ్రహం



- కలెక్టరేట్ ముట్టడికి సిద్ధం.. జీవో-20 రద్దు చేసే వరకు పోరాటం ఆగదు
- డంపింగ్ యార్డుకు బదులు యూనివర్సిటీలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు రావాలి
- కాలుష్యంతో భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది.. ఈస్ట్ హైదరాబాద్‌పై ఎందుకు వివక్ష?
- ఈస్ట్ హైదరాబాద్‌ను చెత్త హబ్‌గా కాదు.. ఐటీ హబ్‌గా మార్చండి : సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్




**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

బండరావిరాల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 268లో గల 494 ఎకరాల విలువైన భూముల్లో ప్రతిపాదిత ఏకో టౌన్ (డంపింగ్ యార్డు) ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు భారీ నిరసన చేపట్టారు. బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో పరిసర గ్రామాల సర్పంచ్‌లు, రైతులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్.. ప్రతిపాదిత డంపింగ్ యార్డు వల్ల సుమారు 15 గ్రామాల ప్రజల ఆరోగ్యం, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్త నిర్వహణ కేంద్రం కారణంగా గాలి, నీరు, భూగర్భ జలాలు కలుషితమై ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల జీవన ప్రమాణాలపై కూడా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే గ్రామసభల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేసి ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని అన్నారు. ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారులకు అత్యంత సమీపంలో ఉన్న ఈ విలువైన భూముల్లో కాలుష్యాన్ని పెంచే డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడం సరైన నిర్ణయం కాదన్నారు. ఈ భూములను ప్రాంత అభివృద్ధికి దోహదపడే విధంగా వినియోగించాలని సూచించారు. డంపింగ్ యార్డుకు బదులుగా అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ విలేజ్, విశ్వవిద్యాలయాలు, ఐఐటీ, ఐఐఎం, సాఫ్ట్‌వేర్ కంపెనీలు లేదా ఐటీ పార్కులను ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈస్ట్ హైదరాబాద్‌ను చెత్త హబ్‌గా మార్చే ప్రయత్నాలు ఎందుకు జరుగుతున్నాయి? పశ్చిమ హైదరాబాద్‌కు ఐటీ కంపెనీలు, భారీ పెట్టుబడులు తీసుకువస్తున్న ప్రభుత్వం తూర్పు హైదరాబాద్‌కు మాత్రం డంపింగ్ యార్డులను కేటాయించడం వెనుక కారణమేంటి? అని ప్రశ్నించారు. ఈస్ట్ హైదరాబాద్‌పై వివక్షను విడనాడి అభివృద్ధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్20ను రద్దు చేసి ఏకో టౌన్ (డంపింగ్ యార్డు) ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా ప్రభుత్వం ముందుకు వెళితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఐదు కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి తమ నిరసనను తెలియజేశామని, అయినప్పటికీ స్పందన లేకపోతే త్వరలోనే భారీ స్థాయిలో కలెక్టరేట్ ముట్టడి చేపడతామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పూర్తిగా రద్దు అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని తేల్చిచెప్పిన సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పబ్బతి బాలకిషన్ గౌడ్ , కొలను రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వనజ శ్రీనివాస్ రెడ్డి, బింగి దేవదాస్ గౌడ్, దుర్గం జంగయ్య యాదవ్,కొత్త ప్రభాకర్, కొత్త కిషన్, కళ్లెం లింగారెడ్డి,నర్సింగరావు, బసవరాజు, అర్జున్, రాసాల రాము యాదవ్ తో పాటు రైతు సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని డంపింగ్ యార్డు ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు.

# పార్కు ప్రహరీ గోడ నిర్మాణంలో 'సెట్ బ్యాక్' పాటించాలి

**రోడ్డుపైకి వచ్చిన నిర్మాణాన్ని వెంటనే వెనక్కి జరపాలి : మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి డిమాండ్**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**



హయాత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో మున్సిపల్ అధికారులు నిర్మిస్తున్న పార్కు ప్రహరీ గోడ విషయంలో నిబంధనల ప్రకారం 'సెట్ బ్యాక్' వదిలి నిర్మాణ పనులు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం బీఆర్ఎస్ నాయకులు రాజు నాయక్, ప్రకాష్ తదితరులతో కలిసి ఆయన నిర్మాణంలో ఉన్న పార్కు స్థలాన్ని పరిశీలించి అధికారుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామ తిరుమల రెడ్డి మాట్లాడుతూ.. హయాత్‌నగర్ డిఫెన్స్ కాలనీ నుంచి బంజారా కాలనీ, మునుగనూరు, తోరూరు వైపు వెళ్లే ప్రధాన రహదారి అత్యంత కీలకమైనదని తెలిపారు. ఈ మార్గంలో నిత్యం భారీగా వాహనాల రాకపోకలు కొనసాగుతుండటంతో పాటు అనేక పాఠశాల బస్సులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు ప్రయాణిస్తుంటారని పేర్కొన్నారు.ప్రైవేట్ వ్యక్తులు ఇళ్లు లేదా వాణిజ్య భవనాలు నిర్మించేటప్పుడు మున్సిపల్ నిబంధనల ప్రకారం రోడ్డు విస్తరణ కోసం తప్పనిసరిగా 'సెట్ బ్యాక్' వదలాల్సి వస్తుందని, అదే నిబంధనలు అమలు చేయాల్సిన మున్సిపల్ అధికారులే వాటిని ఉల్లంఘించడం ఆశ్చర్యకరమని విమర్శించారు. పార్కు ప్రహరీ గోడను దాదాపు ఐదు అడుగుల మేర రోడ్డు వైపు జరిపి నిర్మించడం వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి పార్కు ప్రహరీ గోడ నిర్మాణంలో సెట్ బ్యాక్ నిబంధనలు పాటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే రోడ్డు వైపు వచ్చిన ఐదు అడుగుల నిర్మాణాన్ని వెనక్కి జరిపి, రహదారి వెడల్పును యథాతథంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల విద్యార్థులు, మహిళలు, వృద్ధులు సురక్షితంగా ప్రయాణించేందుకు రహదారి వెడల్పు అవసరమని, ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని పేర్కొన్నారు. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలని, అధికారులు మొండిగా వ్యవహరించకుండా ప్రజల అభిప్రాయాలను గౌరవించి నిర్మాణాన్ని సవరించాలని సామ తిరుమల రెడ్డి, రాజు నాయక్, ప్రకాష్ డిమాండ్ చేశారు. అధికారులు త్వరితగతిన స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు,కాలనీ వాసులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇజ్జత్‌నగర్ రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం

**కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి.. సిపిఐ కార్యదర్శి రామకృష్ణ**



**సైబరాబాద్ విశాల భారతి;** రోడ్డు నిర్మాణం పేరుతో ఇజ్జత్‌నగర్ కాలనీలో రహదారిని పగలగొట్టి 20 రోజులు గడిచినా కొత్త రోడ్డు వేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ మండిపడ్డారు.రోడ్డు పగలగొట్టిన తర్వాత పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో కాలనీవాసులు దుమ్ము, గుంతలు, డ్రైనేజీ నీరు పారుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సుమారు 50 కుటుంబాలు రోడ్డుపాలయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడితే పరిస్థితి మరింత దిగజారి ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయించాలని, నిర్లక్ష్య కాంట్రాక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో కాలనీ ప్రజలతో ఆందోళన చేస్తామని, అధికారుల కార్యాలయాల ముట్టడికి దిగుతామని రామకృష్ణ హెచ్చరించారు.

# ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 ప్రజావాణిలో 4 ఫిర్యాదులు




**సైబరాబాద్ విశాల భారతి;** కూకట్‌పల్లి జోన్ ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉప కమిషనర్ ఇ.చాముండేశ్వరి పౌరుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో భాగంగా మొత్తం 4 ఫిర్యాదులు అందాయి. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 2, యుబిడి 1, ఇంజినీరింగ్ మెయిన్ 1 ఫిర్యాదు ఉన్నాయి. ఫిర్యాదులను వెంటనే సంబంధిత అధికారులకు అప్పగించి త్వరితగతిన పరిష్కరించాలని ఉప కమిషనర్ ఆదేశించారు.

# ఎస్.ఐ.ఆర్ పై శేరిలింగంపల్లి బీజేపీ నేతల సమావేశం



**సైబరాబాద్ విశాల భారతి;** ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే ఎస్.ఐ.ఆర్ ఓటర్ ప్రక్షాళన కార్యక్రమంపై శేరిలింగంపల్లి అసెంబ్లీ బీజేపీ ముఖ్య నేతల సమావేశం మసీద్ బండ కార్యాలయంలో జరిగింది. జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీ, బూత్ లో బీ.ఎల్.ఓ తో పాటు బీ.ఎల్.ఏ రెండు ప్రతిరోజు పర్యటించి దొంగ ఓట్లు తొలగించి నిజమైన ఓటర్లకు అవకాశం కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ సహాయంతో తప్పుల తడక ఓటర్ జాబితాను సరిచేసుకునే అవకాశం ఇదే అని, నాయకులు, కార్యకర్తలు యాక్టివ్ గా ఉండాలని సూచించారు. సమావేశంలో బల్దా అశోక్, అజిత్, హనుమంత్ నాయక్, పద్మ, ఎస్.ఐ.ఆర్ కన్వీనర్ మాణిక్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద నగర్ యువ ఈతగాడికి పీఏసీ చైర్మన్ సన్మానం



**సైబరాబాద్ విశాల భారతి;** వివేకానంద నగర్ కాలనీకి చెందిన చదల్ల వెంకట మణిధర్ రావు జాతీయ ఫిన్‌స్విమ్మింగ్ పోటీల్లో రజత పతకం సాధించి, రెండు వేల ఇరవై ఆరు ప్రపంచ ఫిన్‌స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ కు అర్హత సాధించాడు. మణిధర్ రావును పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శాలువాతో సత్కరించి అభినందించారు. భారత్ నుంచి ఈ ఛాంపియన్‌షిప్ కు ఎంపికైన ఏకైక క్రీడాకారుడు మణిధర్ రావే అని గాంధీ తెలిపారు. ఈ ప్రపంచ ఛాంపియన్‌షిప్ జూన్ ఇరవై రెండు నుంచి ఇరవై తొమ్మిది వరకు దక్షిణ కొరియా ఇంచియన్ లో జరగనుంది. ప్రపంచ వేదికపై భారత్ కు కీర్తి తీసుకు రావాలని గాంధీ ఆకాంక్షించారు.

# చందానగర్ లో రూ.90 లక్షలతో కొత్త బీటీ రోడ్డు

**పనులు ప్రారంభించిన పీఏసీ చైర్మన్ గాంధీ**

**సైబరాబాద్ విశాల భారతి;** జాతీయ రహదారి ఎన్‌హెచ్ 65 నుంచి పీజేఆర్ రోడ్డు అపర్ణ వరకు రూ.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి వెంట ఉన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సౌకర్యం కోసమే ఈ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. కొత్త రోడ్డుతో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గి ప్రయాణం సాఫీగా సాగుతుందని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి తమ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శనంలో అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలుపుతామని చెప్పారు. నాణ్యతతో త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చందానగర్ డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిద్దుతామని పునరుద్ఘాటించారు.కార్యక్రమంలో నాయకులు నాగరాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## కస్తూర్బా పాఠశాలలో భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు



**మొయినాబాద్, విశాలభారతి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మొయినాబాద్ మండల పరిధిలోని నదీమ్‌నగర్ గ్రామంలోని కస్తూర్బా ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ పాల్గొని విద్యార్థులకు బోధనోపకరణాలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న నాయకుడని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మండల, జిల్లా నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 30కు పైగా డ్రైనేజ్ మాన్యువల్స్ జామ్

**ప్రజలు అల్లాడిన దర్గా గ్రామం.. బిఆర్ఎస్ పోరాటంతో కదిలిన జిహెచ్ఎంసి**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** కిస్మత్పూర్ డివిజన్ 122 పరిధిలోని దర్గా గ్రామంలో గత కొన్ని రోజులుగా డ్రైనేజ్ మాన్యువల్స్ సుమారు 30కి పైగా జామ్ అవ్వడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై పలుమార్లు బిఆర్ఎస్ టీం తరపున కిస్మత్పూర్ డివిజన్ ఇంచార్జ్ ఎం. నవీన్ కుమార్ ముదిరాజ్, మాజీ వార్డ్ మెంబర్స్ జావిద్ బేగ్, రాములు యాదవ్, షేక్, మహమ్మద్, శ్రీకాంత్ యాదవ్, సద్దాం, దర్గా బిఆర్ఎస్ విలేజ్ ప్రెసిడెంట్ శ్యాములు మరియు టిఆర్ఎస్ టీం సభ్యులు కలిసి జిహెచ్ఎంసి కార్యాలయంలో కంప్లైంట్లు నమోదు చేశారు. అలాగే ఈ సమస్యను వార్తాపత్రికల ద్వారా కూడా ప్రజల దృష్టికి తీసుకువచ్చారు. దీని పై స్పందించిన జిహెచ్ఎంసి అధికారులు డిఈ గారు, ఏఈ గారు మరియు వారి సిబ్బంది డ్రైనేజ్ క్లీనింగ్ వెహికల్‌ను రిపేర్ చేయించి, ఈ రోజు సిబ్బందిని పంపించి సమస్యను విజయవంతంగా పరిష్కరించారు. దర్గా గ్రామంలో ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని బిఆర్ఎస్ టీం తరపున తెలియజేస్తున్నాము.

ఈ సమస్యను పరిష్కరించడంలో సహకరించిన జిహెచ్ఎంసి డిఈ మరియు వారి బృందానికి బిఆర్ఎస్ టీం మరియు దర్గా గ్రామ ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు.

## పరిచయం పేరుతో ఫోన్ లో యాప్

**ఓటిపి లేకుండానే 5 లక్షలు మాయం**



**సైబరాబాద్ విశాల భారతి:** సన్నిహితంగా మెలిగి సీనియర్ సిటిజన్ నమ్మకాన్ని వాడుకుని బ్యాంకు ఖాతా నుంచి 5 లక్షలు ఎత్తుకెళ్లిన వ్యక్తిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. మాదాపూర్ అయ్యప్ప సొసైటీకి చెందిన 66 ఏళ్ల వి. భారతి యూనియన్ బ్యాంక్ లో పొదుపు ఖాతా ఉంచుకున్నారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వాడని ఆమెకు 2026 మే 9, 11 తేదీల్లో ఖాతా నుంచి 5 లక్షలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఒక్క ఓటిపి, ఫోన్ కాల్ రాకుండానే డబ్బు మాయమైంది. బ్యాంకును సంప్రదించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.విజయవాడకు చెందిన నరేందర్ బాధితురాలి కుటుంబానికి సన్నిహితుడిగా మారాడు. తరచుగా ఇంటికి వచ్చి మాట్లాడేవాడు. ఆ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని ఆమె మొబైల్ లో బ్యాంకింగ్ యాప్ లు ఇన్ స్టాల్ చేశాడు. ఆ తర్వాత ఖాతాలోకి వెళ్లి డబ్బును ఆన్ లైన్ గేమింగ్ యాప్ లకు బదిలీ చేశాడు. నరేందర్ కు ఆన్ లైన్ గేమింగ్ అలవాటు ఉండటంతో మోసం చేసిన సొమ్ముతో గేమ్స్ ఆడేవాడు. సైబర్ క్రైమ్ పోలీసులు సాంకేతిక ఆధారాలు, మొబైల్ లొకేషన్, కాల్ డేటా ఆధారంగా కూకట్ పల్లి లగ్జరీ బాయ్స్ హాస్టల్ లో ఉంటున్న నరేందర్ ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు సీనియర్ సిటిజన్లకు సూచిస్తున్నారు: మొబైల్, బ్యాంకింగ్ వివరాలు, ఓటిపి, పిన్ లను ఎవరితోనూ పంచుకోవద్దు. ఇతరులు మీ ఫోన్ లో బ్యాంకింగ్ యాప్ లు ఇన్ స్టాల్ చేయనివ్వకండి. అనుమానిత లావాదేవీలు జరిగితే వెంటనే బ్యాంకు, 1930 నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేయండి.

## 10 ఏళ్ల తర్వాత న్యాయం

**బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 10 ఏళ్ల జైలు**



**సైబరాబాద్ విశాల భారతి;** పక్కింటి చిన్నారిపై కన్నేసి అత్యాచారానికి పాల్పడిన ఉత్తరప్రదేశ్ కు చెందిన వ్యక్తికి మేడ్చల్ కోర్టు 10 ఏళ్ల కఠిన జైలు శిక్ష విధించింది. 2015 జూన్ 13న మేడ్చల్ లో తన అన్న ఇంటికి వచ్చిన బల్బర్ అధికారి అలియాస్ వికాస్ ఛత్రీ, పక్కింట్లో తల్లిదండ్రులు లేని సమయం చూసి ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక ఇంట్లోకి వెళ్లాడు. నీళ్లు తాగుతానని చెప్పి చిన్న చెల్లిని బయటికి పంపి తలుపు లోపల గడియ పెట్టాడు. బాలికను చున్నీతో కట్టేసి నోరు మూసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. చెల్లి తలుపు బాదుతూ అరుపులు విని నిందితుడు తలుపు తెరిచి అక్కడి నుంచి పారిపోయాడు.ఘటన తర్వాత బాధితురాలి ఫిర్యాదుతో మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు రోజుల్లోనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.పదేళ్లుగా సాగిన విచారణ ముగిసింది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి బల్బర్ అధికారిని దోషిగా తేల్చారు. 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు 5 వేల రూపాయల జరిమానా విధించారు. బాధితురాలికి లక్ష రూపాయల పరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

## వర్షా కాల ఏర్పాట్లపై సైబరాబాద్ సీపీ సమీక్ష




**సైబరాబాద్ విశాల భారతి:** వర్షాకాలంలో ఎదురయ్యే నీటి నిల్వలు, ట్రాఫిక్ సమస్యలు, చెట్లు కూలిపోయే పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్ సోమవారం జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ అధికారులతో కలిసి పోలీస్ స్టేషన్ల వారీగా వాటర్ లాగింగ్ పాయింట్ల పరిస్థితిని పరిశీలించారు. వర్షాలతో నీరు నిలిచే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.వాతావరణ శాఖ సూచనలను ముందే పరిగణనలోకి తీసుకుని అవసరమైన ప్రాంతాల్లో సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో సమన్వయం చేసుకోవాలని, భారీ వర్షాల సమయంలో అదనపు సిబ్బందిని మోహరించి పరిస్థితిని పర్యవేక్షించాలని ఎస్‌హెచ్‌వోలకు తెలిపారు.సీఎంసీ అధికారులతో కలిసి నీటి ప్రవాహ దిశను గుర్తించి, నీరు వేగంగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని, వాటర్ లాగింగ్ తగ్గించాలని సూచించారు. రోడ్లపై వాహనాలు నిలిచిపోకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనసాగుతున్న రోడ్డు పనుల స్థితిగతులపై కూడా సమీక్షించారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలు సీఎంసీ, ఎన్‌డీఆర్ఎఫ్‌తో కలిసి పనిచేసి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు.సమావేశంలో శేరిలింగంపల్లి ట్రాఫిక్ అదనపు డీసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



# త్వరలోనే బదిలీల సమస్యకు పరిష్కారం!

**విశాలభారతి:**

తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్‌జీఓ) హైదరాబాద్ జిల్లా యూనియన్ అధ్యక్షులు ఎస్. విక్రమ్ కుమార్, కార్యదర్శి కురాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా సంఘం ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ ఆసుపత్రులు, శాఖల యూనియన్ నాయకులు నేడు టీఎన్‌జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్. ఎమ్. హుస్సేని (ముజీబ్) లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలలో హైదరాబాద్ జిల్లాలోని టీఎన్‌జీఓస్ యూనియన్ కార్యవర్గ సభ్యులు ఎక్కడికక్కడ తమ ప్రస్తుత పని ప్రదేశాలలోనే కొనసాగేలా కేంద్ర సంఘం చేసిన అసాధారణ కృషికి గాను ఈ సందర్భంగా వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో టీఎన్‌జీఓ కేంద్ర సంఘం కార్యవర్గ సభ్యులు ఉమ (కోశాధికారి), కొండల్ రెడ్డి (ఉపాధ్యక్షులు), నరసింహారెడ్డి (ఉపాధ్యక్షులు), శైలజ (సంయుక్త కార్యదర్శి) కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్ కుమార్, ఈసీ మెంబర్ ముఖీమ్ ఖురేషీలతో పాటు ఖైరతాబాద్, అమీర్‌పేట్, కింగ్ కోఠి, జగమ్మెట్, నాంపల్లి, గోల్కొండ ఆసుపత్రుల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, వర్క్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్, పెన్షన్ పేమెంట్, ట్రెజరీస్ డిపార్ట్‌మెంట్, నిలోఫర్ ఆసుపత్రి, గాంధీ ఆసుపత్రి, ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, ఈసీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కృతజ్ఞతలు తెలిపిన అనంతరం, హైదరాబాద్ జిల్లా పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖ, కార్మిక ఉపాధి మరియు శిక్షణ శాఖలలో నిబంధనలకు విరుద్ధంగా, మానవతా దృక్పథం లేకుండా జిల్లా దాటించి బదిలీ చేసిన పలువురు ఉద్యోగుల సమస్యలను విక్రమ్ కుమార్ కేంద్ర సంఘం నేతలకు వివరించారు. ముఖ్యంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో (పోస్ట్‌న్యూరోసర్జరీ, ఫిట్స్) బాధపడుతున్న అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లు సెక్టార్ పరిధి దాటకుండా చూడాలని, అలాగే భర్త హైదరాబాద్‌లో పనిచేస్తూ భార్యను అన్యాయంగా సంగారెడ్డికి బదిలీ చేసిన ఫార్మాసిస్ట్ గ్రేడ్2 లాంటి వారిని తిరిగి డెప్యుటేషన్‌పై హైదరాబాద్‌కు తీసుకువచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి న్యాయం చేయాలని కేంద్ర సంఘం నాయకత్వాన్ని కోరారు. దీనిపై టీఎన్‌జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ సానుకూలంగా స్పందిస్తూ.. ఈ సమస్యలను వెంటనే సదరు శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, డైరెక్టర్ల దృష్టికి తీసుకెళ్లి, బదిలీల వల్ల నష్టపోయిన ఉద్యోగులందరికీ త్వరలోనే న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.




## రాజేంద్రనగర్‌లో నీటి నిల్వలపై అధికారుల కఠిన చర్యలు



**శాశ్వత పరిష్కారానికి గట్టి ఆదేశాలు**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**




రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో తరచుగా ఏర్పడుతున్న వాటర్ లాగింగ్ సమస్యలపై ఉన్నతాధికారులు సోమవారం సమగ్రంగా పరిశీలన చేపట్టారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్, డీసీపీ ట్రాఫిక్III రాహుల్ హెగ్డే, ట్రాఫిక్ ఏసీపీ రామకృష్ణ (రాజేంద్రనగర్ జోన్), జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి (రాజేంద్రనగర్ జోన్)తో పాటు జిహెచ్ఎంసి , హైడ్రా అధికారులుz మరియు ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఈ పరిశీలనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్‌దేవ్ బాబా సమీపంలోని ప్రధాన వాటర్ లాగింగ్ పాయింట్ (పిల్లర్ నెం. 265) తో పాటు పరిసర ప్రాంతాల్లోని ఇతర నీటి నిల్వ ప్రాంతాలను అధికారులు ప్రత్యక్షంగా సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ప్రతి ప్రాంతంలో నీరు నిల్వ అవుతున్న కారణాలను ఫీల్డ్ సిబ్బందితో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. డ్రైనేజ్ వ్యవస్థ లోపాలు, సిల్ట్ పేరుకుపోవడం, చెత్త మరియు ఇతర వ్యర్థాలు పేరుకుపోవడం వంటి అంశాలు సమస్యకు ప్రధాన కారణాలుగా గుర్తించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని అధికారులు ప్రస్తావించారు. నీరు సాఫీగా పారేలా డ్రైనేజీ లైన్లను శుభ్రం చేయడం, సిల్ట్ తొలగించడం, చెత్తను పూర్తిగా క్లియర్ చేయడం వంటి పనులను తక్షణం చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వర్షపు నీరు వేగంగా పారిపోయే విధంగా శాశ్వత పరిష్కార చర్యలను అమలు చేయాలని, అవసరమైన చోట్ల అదనపు డ్రైనేజీ సదుపాయాలు ఏర్పాటు చేయాలని కూడా అధికారులకు సూచించారు. సమన్వయంతో పనిచేసి సమస్యను పూర్తిగా నివారించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ పరిశీలన ద్వారా వాటర్ లాగింగ్ సమస్యలపై త్వరితగతిన చర్యలు తీసుకునే దిశగా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనుంది.

## నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

**టీఆర్ఎస్ తెలంగాణ రక్షణ సేన ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి కందాడి మణిపాల్ రెడ్డి**

**ఆలేరు, విశాలాభారతి:**




తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగాల భర్తీలో జరుగుతున్న జాప్యం, నిరుద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై టీఆర్ఎస్ తెలంగాణ రక్షణ సేన ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి కందాడి మణిపాల్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ తరఫున పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. మోటకొండూరు మండలం చందేపల్లి గ్రామానికి చెందిన కందాడి మణిపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి యువతను నమ్మించిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగాల కోసం లక్షలాది మంది యువత కోచింగ్ సెంటర్లలో భారీ మొత్తాలు ఖర్చు చేస్తూ, కుటుంబాలపై ఆర్థిక భారం మోస్తున్నారని తెలిపారు. కొంతమంది యువకులు ఒక పూట భోజనం చేసి, మరో పూట ఆకలితో గడిపే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో "యువ వికాసం" పథకాన్ని వెంటనే అమలు చేయాలని, నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 20 వేలకుపైగా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యువతలోని నైపుణ్యాలను గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అప్లికేషన్ ఫీజులను రూ.1000 నుంచి రూ.100కు తగ్గించాలని, జీవో నెం.46ను రద్దు చేసి వయోపరిమితి విషయంలో యువతకు అనుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ రంగంలో స్థానిక యువతకు 70 శాతం ఉద్యోగాలు కేటాయించాలని, ప్రతి సంవత్సరం ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉపాధి అవకాశాలు లేక యువతలో నిరాశ పెరుగుతోందని, కొందరు మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. టీఆర్ఎస్ పార్టీ తరఫున చేసిన ఈ డిమాండ్లను జిల్లా కలెక్టర్ స్వీకరించి, అమలుకు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత సంక్షేమం, ఉపాధి అవకాశాల కల్పన ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, యువతకు న్యాయం జరిగే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని కందాడి మణిపాల్ రెడ్డి హెచ్చరించారు.

## మంత్రి కిషన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

**సికింద్రాబాద్, విశాల భారతి:** భారతీయ జనతా పార్టీ కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి కి భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నిజాంపేట్ అధ్యక్షులు పొట్లకాయల వెంకటేశ్వర ముదిరాజ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కిషన్ రెడ్డి నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ ఇంకా అభివృద్ధి చెందాలని అదే విధంగా రాబోయే మున్సిపాలిటీ ఎలక్షన్లో భారతీయ జనతా పార్టీ అఖండమైన మెజార్టీతో మేయర్ సీటు కైవశం చేసుకోవాలని కోరారు.



## వర్షా కాలం నేపథ్యంలో విద్యుత్ అంతరాయాల నివారణకు చెట్ల కొమ్మల తొలగింపు

**జూన్ 16న పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ లైన్లపై పడే చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని మంగళవారం (జూన్ 16) నిర్వహించనున్నట్లు పెద్దఅంబర్‌పేట్ విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ (ఏఈ) తెలిపారు. 11 కేవీ లక్ష్మీ గణపతి ఫీడర్ పరిధిలో ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, అలాగే 11 కేవీ తట్టిఅన్నారం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలు, ట్రిప్పింగ్ సమస్యలను తగ్గించడం, విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా కొనసాగించడం లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పనుల నిర్వహణ సమయంలో సంబంధిత ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయబడుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు సహకరించాలని కోరుతూ, విద్యుత్ సరఫరా నిలిపివేత వల్ల కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు.

## వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్

**ప్రత్యేక పూజల్లో పాల్గొని రాష్ట్ర శ్రేయస్సు కోసం ప్రార్థనలు**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్ సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాల్లో బసవరాజ్ శ్రీనివాస్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కె. మృత్యుంజయం తదితరులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరమేశ్వరుని కరుణాకటాక్షాలు తెలంగాణ ప్రజలందరిపై ప్రసరించాలని, రాష్ట్రం సుఖశాంతులు, ఐశ్వర్యం, సిరిసంపదలతో అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఆనందం, శ్రేయస్సు కలగాలని స్వామివారిని వేడుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధల నడుమ జరిగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.

## గఫూర్ నగర్ ముంపునకు చెక్

**గఫూర్ నగర్‌లో పిఎసి చైర్మన్ గాంధీ పర్యటన**




**సైబరాబాద్ విశాల భారతి:** గఫూర్ నగర్ కాలనీలోని ఇన్ లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ డిసి బాలకృష్ణ, సిఎంసి ఇంజనీరింగ్, ప్రాజెక్ట్స్ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు.ఇన్ లెట్ ఇరుకుగా ఉండడం, చెత్త చేరడంతో వర్షాకాలంలో మురుగు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గాంధీ చెప్పారు. ఇన్ లెట్ ను సరిచేసి వెడల్పు చేయాలని, మ్యాన్ హోళ్ల మరమ్మతులు చేపట్టాలని, ఎయిర్ టెక్ మిషన్ ద్వారా పూడిక తీయాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిద్దుతామని, కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చూస్తామని గాంధీ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో సిఎంసి ఇఈ గోవర్ధన్, ప్రాజెక్ట్స్ డిఇ ధీరజ్, వర్క్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చిలుక మధుసూదన్ రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ని సోమవారం ఉదయం ప్రజా భవన్‌లో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు కలిగి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో భట్టి విక్రమార్క కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని చిలుక మధుసూదన్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి,పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా ఉప ముఖ్యమంత్రిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

విశాల భారతి

# ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు




**విశాల భారతి, మణుగూరు :**

పినపాక నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, చెరువుల అభివృద్ధి పనులు, కెనాల్స్ నిర్మాణం మరియు పెండింగ్ ప్రతిపాదనలపై పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం మణుగూరులోని క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని ప్రతి రైతుకు సాగునీటి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కరకగూడెం మండల పరిధిలో ప్రతిపాదిత పులుసుబొంత ప్రాజెక్టు పనుల పురోగతిని ఎమ్మెల్యే సమీక్షించారు. ప్రాజెక్టుకు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (DPR)ను త్వరితగతిన పూర్తి చేయాలని, ఫారెస్ట్ క్లియరెన్స్ మరియు భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన నివేదికలు ప్రభుత్వానికి సమర్పిస్తే నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మణుగూరు మండలంలోని రేగులగండి చెరువు ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయడానికి అవసరమైన అంచనాలతో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పూర్తయితే ఆయకట్టు రైతులకు గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులను మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా రైట్ కెనాల్ పనులతో పాటు లెఫ్ట్ కెనాల్, గ్రావిటీ కెనాల్ సర్వేలు మరియు భూసేకరణ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. బూర్గంపాడు మండలంలోని దోమల వాగు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసే ప్రతిపాదనపై సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, సాంకేతిక అంశాలు మరియు పరిపాలనా అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి ప్రభుత్వానికి పూర్తి వివరాలు పంపాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని సాగునీటి విస్తరణ కోసం క్రింది లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ పథకాల ద్వారా సాగునీటి వసతి మరింత విస్తరించి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఉన్న చెరువులు, కుంటలు, ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుల కట్టలు, తూములు, షట్టర్లు, మరమ్మతులు అవసరమైన ఇతర పనులను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అవసరమైన నిధుల మంజూరుకు ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు, రైతులకు తక్షణ ప్రయోజనం చేకూరేలా పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు మరియు కెనాల్ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారు అధికారులను ఆదేశించారు. ప్రతి పనిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించి పురోగతి నివేదికలను క్రమం తప్పకుండా సమర్పించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ ఈఈ తెల్లం వెంకటేశ్వర్లు, డీఈలు బి. రమేష్, నాగమల్లేశ్వరరావు, పి. శ్రీనివాస్, అలాగే పినపాక నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన ఏఈలు పాల్గొన్నారు.

## కుడియ తండాలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం



**మరిపెడ, విశాల భారతి:** మరిపెడ మండలం స్టేజి తండా గ్రామపంచాయతీ పరిధిలోని కుడియ తండా అంగన్‌వాడీ కేంద్రంలో మన ఊరు – మన అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్లంపేట సెక్టార్ సూపర్వైజర్ ఉషారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రతి అర్హత కలిగిన చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ప్రీస్కూల్ విద్య, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.అలాగే గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అంగన్‌వాడీ సేవల ప్రాధాన్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాటోతు అమ్మి, అంగన్‌వాడీ టీచర్లు కుమ్మరి కుంట్ల జ్యోతి, శ్రీలత, పద్మ,మహిళలు, గ్రామస్తులు, చిన్నారులు పాల్గొని బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులకు ఘన స్వాగతం



**మరిపెడ విశాల భారతి:** ఈ రోజు పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు అనంతరావు మరియు ఉపాధ్యాయ బృందం పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలకు తిరిగి వచ్చిన విద్యార్థులను ఆప్యాయంగా ఆహ్వానించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నూతన విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యా, క్రీడా మరియు సాంస్కృతిక రంగాలలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.ఉపాధ్యాయులు విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, మధురమైన స్వాగతం పలికారు. పాఠశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడింది. విద్యార్థులు కూడా ఉపాధ్యాయుల ఆప్యాయ స్వాగతానికి హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, స్టాఫ్ సెక్రటరీ అండ్ సీనియర్ టీచర్ బయగాని రామ్మోహన్ ఉపాధ్యాయ బృందం జనార్ధనా చారి, దేవుల, శ్రీశైలం, నెహ్రూ, స్వప్న, ప్రకాష్, శౌరి, రమేష్ రెడ్డి, లెనిన్, ప్రసాదరావు, సారయ్య, జహేదా బేగం, సురేష్, బాబురావు, అనిత, రాజకుమారి, సుధా, మంజుశ్రీ, శంకర్, భువనేశ్వరి, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా వెల్కమ్ డే ఉత్సవాలు



**దేవరుప్పుల విశాలభారతి:** నిర్మల హరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల పునర్ ప్రారంభోత్సవం సందర్భంగా వెల్కమ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరానికి విద్యార్థులను పుష్పగుచ్ఛాలు, స్వీట్లు అందజేసి, పూలు జల్లి ఆత్మీయంగా స్వాగతం పలికారు షేక్ హ్యాండ్, నమస్కారం, హగ్, ల ద్వారా విద్యార్థులను పాఠశాలల్లోకి ఆహ్వానించారు. అంగన్వాడీ నుంచి ప్రాథమిక పాఠశాలలో చేరిన విద్యార్థులు, అలాగే అంగన్వాడీలో కొత్తగా చేరిన చిన్నారులు, మరియు వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెల్ఫీ కిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, విద్యార్థులు ఆనందంగా సెల్ఫీలు దిగారు. ప్రధానోపాధ్యాయుడు శివగాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, తల్లిదండ్రులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని, కోరారు కొత్తగా చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వాగతం పలికారు.కార్యక్రమం అనంతరం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు నల్ల నిర్మల, రాజోజు లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు నల్ల మల్లమ్మ, నల్ల జయమ్మ, నాగలక్ష్మి గౌరగల్ల శారద, క్రాంతి, నర్సింహులు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి సెక్షన్ లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**సైబరాబాద్ విశాల భారతి:** ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది.11కెవి ఏపీహెచ్ బి ఫీడర్, 11కెవి మంజీరా డైమండ్ ఫీడర్ లకు సంబంధించిన ఏపీహెచ్ బి కాలనీ, డిఎల్ఎఫ్ రోడ్, ఫైర్ స్టేషన్, గౌలిదొడ్డి, జర్నలిస్ట్ కాలనీ తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదు. అధికారులు వినియోగదారులు సహకరించాలని కోరారు.

**తారానగర్ సబ్ స్టేషన్ పరిధిలో...**

ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా మంగళవారం రెండు విడతలుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది.ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11కెవి ఇంజనీర్స్ ఎన్ క్లేవ్ ఫీడర్ కు సంబంధించి ఇంజనీర్స్ ఎన్ క్లేవ్, చందానగర్, గంగారం ప్రాంతాల్లో కరెంట్ ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కెవి రైల్ విహార్ ఫీడర్ కు సంబంధించి హుడా కాలనీ, సిటిజన్ కాలనీ లింగంపల్లి, రైల్ విహార్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.వినియోగదారులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# వర్షపు చీకట్లో విద్యుత్ నిర్లక్ష్యం

- మియాపూర్‌లో ఇంటర్ విద్యార్థి అకాల మృతి
- వేలాడుతున్న తీగలపై కాలు.. కుటుంబంలో విషాదం
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

**సైబరాబాద్ - విశాల భారతి:**

వర్షాకాలం ఆరంభంలోనే విద్యుత్ శాఖ నిర్లక్ష్యం మరోసారి ఓ కుటుంబంలో విషాదం నింపింది. మియాపూర్ మదీనాగూడ ప్రాంతంలో శనివారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై ఇంటర్ విద్యార్థి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌కు చెందిన జాదవ్ రాజు కుమారుడు మహేష్ జాదవ్ ఈ ప్రమాదంలో మృతి చెందాడు. 18 ఏళ్ల వయసులో ఉన్నత చదువుల కలతో ఉన్న యువకుడి అకాల మృతి స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.మదీనాగూడలోని చెరకు రసం బండి సమీపంలోని షవర్మా దుకాణం వద్ద అగ్గిపెట్టె కొనుగోలు చేయడానికి మహేష్ వెళ్లాడు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పక్కన విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉన్నాయి. నేలకు తగులుతున్న ఆ తీగలను గమనించకుండా అతను అడుగు వేయడంతో క్షణాల్లో విద్యుత్ షాక్ తగిలింది. కుప్పకూలిన మహేష్‌ను స్థానికులు వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆలస్యం అయింది. వైద్యులు అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కొడుకును కోల్పోయిన తల్లిదండ్రుల రోదనలు చూపరులను కలచివేస్తున్నాయి.ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. వర్షం కారణంగా విద్యుత్ వైర్లు సరిగా నిర్వహణ లేకుండా బయటపడి వేలాడుతూ ఉండటమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు గుర్తించారు. వర్షాకాలం మొదలై వారం రోజులు గడుస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు తీగల తనిఖీలు, మరమ్మతులు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షం పడగానే ఈ ప్రాంతంలో విద్యుత్ తీగలు ఇలా కిందకు వేలాడుతూ ఉంటాయి. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు కనీసం పట్టించుకోరు. మహేష్ లాంటి అమాయకులు ప్రాణాలు కోల్పోయిన తర్వాతనైనా అధికారులు మేల్కొంటారా?" అని స్థానిక వ్యాపారి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో మియాపూర్, మదీనాగూడ, చందానగర్ ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగిపడడం, స్తంభాల నుంచి



షాకులు తగలడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని, అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మృతుడి కుటుంబం ఈ ఘటనను సాధారణ ప్రమాదంగా పరిగణించడం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ శాఖ అధికారులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు ఘటనా స్థలాన్ని సందర్శించి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని, వేలాడుతున్న తీగలను సరిదిద్ది ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని కోరారు. వర్షాకాలంలో ప్రతి విద్యుత్ స్తంభం, ప్రతి తీగను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖపై ఉందని వారు గుర్తు చేశారు.ఉన్నత చదువులు చదివి కుటుంబానికి ఆసరాగా ఉండాల్సిన యువకుడు అధికారుల నిర్లక్ష్యానికి బలికావడం తీవ్రంగా కలచివేస్తోంది. ప్రతి వర్షాకాలంలోనూ ఇలాంటి విద్యుత్ ప్రమాదాలు పునరావృతమవుతూనే ఉన్నాయి. ప్రాణాలు పోయిన తర్వాత అధికారులు స్పందించి తీగలు సరిచేయడం అలవాటుగా మారింది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ కళ్లు తెరిచి, ముందస్తు చర్యలు తీసుకోకపోతే మరిన్ని మహేష్‌లు బలవుతారేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## అల్కాపూర్‌లో తవ్వకాల గుట్టు విప్పాలన్న బీఆర్ఎస్




**కోట్ల ప్రాజెక్ట్‌లో అక్రమాల అనుమానం!**

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

మణికొండ ప్రాంతంలోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో రోడ్ నెం.30 వద్ద జరుగుతున్న తవ్వకాల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఈ వ్యవహారంపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ప్రజా సమస్యలపై పర్యవేక్షణలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు అల్కాపూర్ టౌన్‌షిప్‌లో పలు ప్రాంతాలను సందర్శించి స్థానిక సమస్యలను పరిశీలించారు. రోడ్ నెం.30లో జరుగుతున్న తవ్వకాల వెనుక ముగ్గురు రాజకీయ నాయకుల పాత్ర ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.1.85 కోట్ల అంచనా వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనికి అనుమతి లభించినప్పటికీ, రూ.99.43 లక్షలకు టెండర్ ఖరారు చేయబడినట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. అయితే 2026 మే 11న సెరిలింగంపల్లి జోన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జారీ చేసిన వర్క్ ఆర్డర్‌లో ఈ పనిని వర్షపు నీటి కాలువగా పేర్కొనడం మరింత అనుమానాలకు తావిస్తోంది. ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోకుండా లోతైన తవ్వకాలు చేపట్టడం వల్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, స్టార్మ్ వాటర్ డ్రెయిన్, తాగునీటి పైపులకు నష్టం వాటిల్లినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజల రాకపోకలు కూడా తీవ్రంగా అంతరాయం కలిగాయి. ఇప్పటికే అల్కాపూర్‌లో వర్షపు నీటి కాలువల వ్యవస్థ ఉన్నప్పటికీ, మరో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ అవసరం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అదనంగా, ఈ పనిని పూజా బిల్డర్స్ ప్రాంగణంలోని యూజీడీ లైన్‌కు అనుసంధానం చేస్తున్నారనే ఆరోపణలు మరింత చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో కొన్ని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు కాంట్రాక్టర్‌కు మద్దతుగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. స్థానిక నాయకుల ప్రభావంతో ఆర్‌డబ్ల్యూఏలు పనిచేస్తున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా మణికొండ మున్సిపాలిటీ కాలంలో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పేరుతో యూజీడీ నిర్మాణం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని, దాని వల్ల అంజలి గార్డెన్స్ కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు గుర్తుచేశారు. ఇదే సందర్భంగా రోడ్ నెం.30లోని జయశంకర్ పార్క్ పరిస్థితి కూడా దారుణంగా ఉందని వారు తెలిపారు. వాకింగ్ ట్రాక్ వద్ద విద్యుత్ దీపాలు పనిచేయకపోవడం, పారిశుద్ధ్యం లోపించడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం, చెత్త పేరుకుపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే పార్క్ వాచ్‌మన్‌కు గత నాలుగు నెలలుగా వేతనం చెల్లించలేదని సమాచారం ఉందని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో పారదర్శకత, ప్రజా ప్రయోజనాలు కాపాడాలని, అక్రమాలు తేలితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

## చేవెళ్లలో విద్యా దందాపై ఏబీవీపీ ఆగ్రహం – వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన హెచ్చరిక



**విశాల భారతి, చేవెళ్ల :** చేవెళ్ల మండలంలో విద్య పేరుతో జరుగుతున్న దోపిడిపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మండల విద్యాధికారి ( ఎం ఈ ఓ కి )వినతిపత్రం సమర్పిస్తూ, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ మాట్లాడుతూ, మండలంలోని ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. పుస్తకాలు, యూనిఫాం, ఇతర విద్యాసామాగ్రిని నిర్దిష్ట దుకాణాల నుంచే కొనాలని తల్లిదండ్రులను బలవంతం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. విద్యార్థులపై అధిక విద్యాభారం మోపుతూ, ప్రత్యేక తరగతుల పేరుతో మానసిక ఒత్తిడి పెంచుతున్నారని ఆరోపించారు. ఇంకా కొన్ని విద్యాసంస్థలు సరైన అనుమతులు లేకుండా, మౌలిక సదుపాయాలు లేకుండా కొనసాగుతున్నాయని వెల్లడించారు.ఇలాంటి అక్రమాలపై వెంటనే ప్రత్యేక తనిఖీలు చేపట్టి, అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జైపాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కిషన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు



**సికింద్రాబాద్, విశాలభారతి:** కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మేకల కీర్తి హర్ష కిరణ్ డివిజన్ సీనియర్ నాయకులతో కలిసి ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా నగర పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న జీహెచ్ఎంసీ మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేయడంతో పాటు, స్థానిక వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కీర్తి హర్ష కిరణ్ మాట్లాడుతూ.. అందరి ఆశీస్సులు ఎల్లప్పుడూ కిషన్ రెడ్డి అన్న కి ఉండాలని, ఆ భగవంతుడు వారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని, వారు రాజకీయంగా భరతమాత సేవలో ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ సేవా మహోత్సవంలో సీనియర్ నాయకులు నాగరాణి, వసంత, కిరణ్,వినోద్, శ్రీకాంత్, ప్రేమ్, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**సికింద్రాబాద్, విశాలభారతి:** వారాసిగూడలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.బిజెపి బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షులు సాయిప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగాయి. కేక్ కట్ చేసి మంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా స్థానికులకు, కార్యకర్తలకు, వాహనదారులకు పలహారం పంచిపెట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో.. మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్, కృష్ణమూర్తి,రవి ప్రసాద్ గౌడ్ ,నాగేష్ రెడ్డి,హరి,శారదా మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ బావిలో చిక్కుకున్న జింకకు ప్రాణదానం

- రైతుల సాహసంతో సురక్షితంగా బయటపడిన వన్యప్రాణి



**ఆత్మకూర్(ఎం), విశాలాభారతి:** ఆత్మకూర్(ఎం) మండలంలోని కొరటికల్ గ్రామ శివారులో బిక్కేరు వాగు సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో జింక ప్రత్యక్షమైంది. నీటి కోసం వచ్చిన జింక ప్రమాదవశాత్తు బావిలో పడిపోయినట్లు స్థానికులు భావిస్తున్నారు. బావిలో చిక్కుకుని బయటకు రాలేకపోతున్న జింకను గమనించిన రైతులు వెంటనే అప్రమత్తమై రక్షణ చర్యలు చేపట్టారు. స్థానిక రైతులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించి జింకకు ఎలాంటి గాయాలు కాకుండా బావిలో నుంచి సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేయగా, వారు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని జింకను తమ ఆధీనంలోకి తీసుకుని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. జింకను రక్షించిన రైతుల సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు. సమయస్ఫూర్తితో స్పందించి ఓ మూగజీవి ప్రాణాలను కాపాడిన రైతులు ప్రశంసలు అందుకుంటున్నారు.

## అసంపూర్తి బిటి రోడ్డు నిర్మాణం పై ఏపీఓ కి వినతి

- ప్రజాదర్బార్‌లో ఆదివాసి సమస్యలపై వినతి
- అసంపూర్తిగా నిలిచిన బిటి రోడ్డు నిర్మాణం పై లేఖ
- ఆదివాసీల అభివృద్దే నాలక్ష్యం మెండి భాస్కర్



**బూర్గంపాడు /విశాలభారతి :** సోమవారం ప్రజాదర్బార్ లో (ఐ టి డి ఏ) ఏ పి ఓ డేవిడ్ రాజ్ కి అసంపూర్తి బీటీ రోడ్ నిర్మాణం పై వినతి పత్రం అందజేసిన ఆదివాసి మండల నాయకుడు మెండి భాస్కర్. ఈ సందర్భంగా మెండి భాస్కర్ ఏపీఓ డేవిడ్ రాజుకి క్లుప్తంగా వివరిస్తూ వేపలగడ్డ గ్రామం నుండి కొమ్ముగకిరేపేట 2.5.కిమీ వరకు మిడ్ మిక్స్ పోసి అర్ధంతరంగా నిలిపివేశారని వివరించారు. బీటీ రోడ్ నిర్మాణం 3' సంవత్సరాలు గడుస్తున్న ఇంకా పూర్తి కాకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తి కాకముందే 2 కోట్ల అంచనా వ్యయంతో కూడిన బోర్డు ప్రత్యక్షం కావడంతో అనేక సందేహాలు ఆదివాసీల్లో వ్యక్తం అవుతున్నాయని అన్నారు. మిడ్ మిక్స్ కారణంగా రహదారి ప్రయాణాలు అత్యవసర పరిస్థితుల్లో నరకప్రాయంగా మారడంతో సకాలంలో వైద్యం అందక గర్భిణీ స్త్రీలు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన ఏపీఓ (ఆర్ అండ్ బి) అధికారులను ఇట్టి రోడ్డుపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

## మన ఊరు – మన అంగన్‌వాడీ చిన్నారుల భవిష్యత్తుకు బడిబాట

**మరిపెడ, విశాల భారతి:** మరిపెడ మండలంలోని ఎల్లంపేట గ్రామపంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో "మన ఊరు - మన అంగన్‌వాడీ" అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలో ఇంటింటికి వెళ్లి చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందించే పోషకాహారం, ప్రీస్కూల్ విద్య, ఆరోగ్య పరీక్షలు, టీకాలు, గర్భిణీలు మరియు బాలింతలకు అందించే సేవల గురించి వివరించారు. పిల్లల శారీరక, మానసిక వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. అలాగే కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. ప్రతి అర్హత కలిగిన చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బానోతు భద్రమ్మ, సరిత, అంగన్వాడి హెల్పర్స్ నాగమణి ,శారద, మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొని బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# కాకర్లపల్లి పేదలకు ఇండ్ల స్థలాలిచ్చే వరకు పోరాటం ఆగదు

- **స్థలాలిస్తే ఆ పేరు మాకొద్దు... ఆ ఘనత మీకే: సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**
- **ఇండ్ల స్థలాల సాధన కోసం రిలే దీక్షలకు దిగిన కాకర్లపల్లి పేదలు**
- **సమస్య పరిష్కారం వరకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందన్న నున్నా నాగేశ్వరరావు**
- **పాత ఎన్టీఆర్ కాలువను పూడ్చి పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్**




**స్వేచ్ఛ, విశాలభారతి :** సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేంత వరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమం ఆగదని, సమస్య పరిష్కారమయ్యేంత వరకు సీపీఐ(ఎం) శ్రేణులు ఇండ్లు లేని పేదలకు అండగా ఉంటాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు స్పష్టం చేశారు.కాకర్లపల్లి ఇండ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో సత్తుపల్లిలోని పోస్టాఫీసు ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట రిలే దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలను నున్నా నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, కాకర్లపల్లి పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. స్థలాలు రాకుండా అడ్డుపడితే ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఇంటిని సైతం ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రాణాలు పోయినా వెనక్కి తగ్గేది లేదని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలకు కూడా దిగుతామని స్పష్టం చేశారు.ఇండ్ల స్థలాలు రాకుండా అడ్డుపడుతున్న నాయకులపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. తమకు ఇండ్లు, ఇంటి స్థలాలు లేవంటూ కాకర్లపల్లి నుంచి సత్తుపల్లి వరకు గతంలో ఎండలో పాదయాత్ర నిర్వహించినప్పటికీ పాలకులకు కనికరం లేకపోయిందన్నారు. ఖమ్మం వెళ్లి కలెక్టర్‌ను, పలుమార్లు సబ్ కలెక్టర్‌ను కలిశామని, తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలు దఫాలుగా ధర్నాలు నిర్వహించామని తెలిపారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కూడా కలిసి వినతిపత్రం అందజేశామని చెప్పారు.మంత్రి నుంచి కలెక్టర్, సబ్ కలెక్టర్, తహసీల్దార్ వరకు అందరూ సానుకూలంగా స్పందించినప్పటికీ ఇప్పటి వరకు అమలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాకర్లపల్లి కాంగ్రెస్ నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించి ఇండ్ల స్థలాలు రాకుండా అడ్డుపడుతున్నారని, ఈ విషయంలో ఎమ్మెల్యే కూడా మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. కాకర్లపల్లిని ఆనుకుని విరాట్‌నగర్ వరకు నిరుపయోగంగా ఉన్న పాత ఎన్టీఆర్ కాలువను పూడ్చితే సుమారు 34 ఎకరాల భూమి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఆ భూమిని ఇంటి స్థలాలుగా కేటాయిస్తే వెయ్యి మందికి పైగా పేదలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. సత్తుపల్లిలో సుమారు మూడు వేల మందికి పైగా సొంత ఇళ్లు, సొంత స్థలాలు లేని పేదలు ఉన్నారని పేర్కొన్నారు. సీపీఐ(ఎం) పోరాట ఫలితంగా ప్రభుత్వం స్థలాలు ఇచ్చినా ఆ పేరు తమకు అవసరం లేదని, ఆ ఘనత ప్రభుత్వానికే దక్కాలని అన్నారు. తమకు పేరు రావడం ముఖ్యమికాదని, పేదలకు ఇంటి స్థలాలు రావడమే ముఖ్యమని స్పష్టం చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మెరుగు సత్యనారాయణ, పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని,ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సీపీఐ(ఎం) పేదలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు.సీపీఐ(ఎం) మండల కార్యదర్శి జాజిరి జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, మోరంపూడి పాండురంగారావు, పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, డివిజన్ కమిటీ సభ్యులు రావుల రాజబాబు, మిట్టపల్లి నాగమణి, పాకలపాటి ఝాన్సీ, పీఎన్ఎం డివిజన్ అధ్యక్షుడు కండే సత్యం, కార్యదర్శి అయినంపూడి సనందనరావు, మండల కమిటీ సభ్యులు వేపులపాటి కుమారస్వామి, బండి వేలాద్రి, కువ్వారపు లక్ష్మణరావు, తడికమళ్ల రామకృష్ణ, కావూరి వెంకటేశ్వరరావు, దాట్ల రాంబాబు, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు పొదిలి నరేశ్, బెజవాడ కృష్ణవేణి, ఆంగోతు చిట్టెమ్మ, పరిమి సీతామహాలక్ష్మి, ఐద్వా డివిజన్ అధ్యక్షురాలు చెరుకు రత్నకుమారి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## కొడుకు, కోడలు వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి

**కలెక్టర్‌కు 85 ఏళ్ల వృద్ధురాలి ఫిర్యాదు**



**పాల్వంచ విశాలభారతి:** కొత్తగూడెం పాల్వంచ కార్పొరేషన్ 34 వ డివిజన్ కరకవాగు గ్రామానికి చెందిన 85 ఏళ్ల వృద్ధురాలు భట్టు కోమి తన కొడుకు, కోడలు వేధింపుల నుంచి రక్షణ కల్పించి, తన ఆస్తి, పొలాన్ని తిరిగి ఇప్పించాలని జిల్లా కలెక్టర్ అంకిత్‌కు ఫిర్యాదు చేశారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమంలో ఆమె వినతిపత్రం సమర్పించారు. తనకు ముగ్గురు కుమారులు ఉన్నారని, వారిలో పెద్ద కుమారుడు భట్టు రామ్ దన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారని తెలిపారు. తనను బాగా చూసుకుంటానని నమ్మబలికి ఇంటి స్థలం, నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలపై సంతకాలు తీసుకున్నాడని ఆరోపించారు.ఆ తర్వాత తనకు సరైన భోజనం కూడా పెట్టకుండా వేధింపులకు గురిచేస్తూ, దుర్భాషలాడుతున్నారని, తనపై దాడి చేస్తున్నారని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు వచ్చే వృద్ధాప్య పింఛన్ డబ్బులను కూడా తీసుకుంటున్నారని కన్నీటి పర్యంతమయ్యారు.తన భూమి, పింఛన్ డబ్బులు తిరిగి ఇప్పించి, కొడుకు-కోడలు వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ అంకిత్ వెంటనే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు.

## కుంట్లూరులో ప్రభుత్వ భూముల హద్దులపై వివాదం

**సర్వే చేసి స్పష్టమైన సరిహద్దులు నిర్ణయించాలంటున్న స్థానికులు**






**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణ చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో సర్వే నంబర్ 24లోని భూముల హద్దుల విషయంలో స్థానికంగా చర్చ జరుగుతోంది.గ్రామంలో ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, గతంలో సరైన హద్దులు నిర్ధారించకపోవడం వల్ల ఇటువంటి వివాదాలు తలెత్తుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు గ్రామంలోని ప్రభుత్వ స్థలాలను పూర్తిస్థాయిలో గుర్తించి, స్పష్టమైన సరిహద్దులను ఏర్పాటు చేసి, ఆక్రమణలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇటీవల సర్వే నంబర్ 24లో ప్రభుత్వ భూమిగా గుర్తించిన ప్రాంతంలో అధికారులు ప్రహరీ గోడలను తొలగించి ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేశారు. అయితే సర్వే నంబర్ 24లో ఉన్న 20 గుంటల స్థలానికి సంబంధించి భూమి యజమానులు మందడి శాంత మరియు గంపల నీలిమ అభ్యంతరం వ్యక్తం చేశారు.తమకు చట్టబద్ధంగా ఉన్న స్థలానికి ముందుగా పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, సరైన హద్దులను నిర్ణయించిన తర్వాత మిగిలిన భూమిని ప్రభుత్వ స్థలంగా గుర్తించాల్సిందని వారు పేర్కొన్నారు.సర్వే ప్రక్రియ పూర్తికాకముందే ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేయడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తూ,సంబంధిత అధికారులు మరోసారి సమగ్రంగా భూ సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని కోరారు.గ్రామంలో ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు ప్రైవేటు భూముల హక్కులు కూడా దెబ్బతినకుండా పారదర్శకంగా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి అన్ని ప్రభుత్వ స్థలాలకు శాశ్వత హద్దులు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఇటువంటి వివాదాలకు తెరపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్మెట్ మండల రెవెన్యూ అధికారి రాంబాబు, కుంట్లూర్ గ్రామ జిపిఓ రాణి, సర్వేయర్ తోపాటు మండల రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బి.ఎన్.రెడ్డి నగర్ లో 116 ఎకరాల్లో ఆహ్లాదకరమైన పార్కు అభివృద్ధి

- **మధుయాష్కి గౌడ్.. ఈనెల 18న సీఎం రేవంత్ రెడ్డి వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపు**
- **సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్‌తో కలిసి ఏర్పాట్ల పరిశీలన**



**ఎల్బీనగర్ విశాలభారతి:** బి.ఎన్.రెడ్డి నగర్ ప్రాంత వాసులకు కేబీఆర్ పార్కు లాగా ఆహ్లాదకరమైన వాతావరణం లో అద్భుతమైన పార్కు ఏర్పాటు కాబోతుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. ఈనెల 18న బి.యన్ రెడ్డి నగర్ ను ఆనుకొని ఉన్న ఫారెస్టులో వన మహోత్సవ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్న నేపథ్యంలో.. ఏర్పాట్లను అధికారులతో కలిసి మధుయాష్కి గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంక వర్గీస్ , డీఎఫ్ఓ రోహిత్ రెడ్డి, ఏసీపీ కాశీ రెడ్డి తో కలిసి సీఎం కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజలకు 116 ఎకరాల్లో పార్కును అందులో అందుబాటులోకి రావడం అదృష్టమన్నారు. 30 ఏళ్లుగా ఉన్న స్థల వివాదాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పరిష్కరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తుందని పేర్కొన్నారు. పార్కుగా అభివృద్ధి చేయడమే కాకుండా రూ. 20 కోట్ల తో బి.ఎన్.రెడ్డి నగర్ పరిసర ప్రాంత ప్రజలకు వరద, డ్రైనేజీ నీటి సమస్య పరిష్కారానికి బాక్స్ డ్రైన్, డ్రైనేజీ లైన్ల నిర్మాణాలు కూడా చేపడుతున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోలేదని, హైదరాబాద్ నిధులన్నీ కాళేశ్వరాన్ని తరలించిందని విమర్శించారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇక్కడి నిధులను నగర ప్రజలకే ఖర్చు పెడుతూ అభివృద్ధిని, మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈనెల 18న సాయంత్రం 4 గంటలకు జరిగే సీఎం రేవంత్ రెడ్డి వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిసర ప్రాంతాల కాలనీ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ శ్రీనివాస్, ఎఫ్ డీ ఓ బాబ్జీరావ్ , వెంకటయ్య , ఎఫ్ ఆర్ఓ శ్రీనివాస్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

**పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్లు షాబాద్ కిషన్, పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్**




**మొయినాబాద్: (విశాలభారతి):** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిలుగా మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ షాబాద్ కిషన్, 10వ వార్డు కౌన్సిలర్ పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్ హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు వారి చేతులమీదగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పోషకాహార విలువలతో కూడిన ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యతో పాటు ప్రవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వం అన్నీ సౌకర్యాలను కల్పిస్తుందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కృషి చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు జులేఖ సుల్తానా, అరుణమ్మ, హై స్కూల్ ఏఏపీసీ చైర్మన్ మహేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## జాఫర్‌గూడ చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మృతుడి గుర్తింపు కోసం ప్రయత్నాలు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాఫర్‌గూడ గ్రామ చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. చెరువులో మృతదేహం తేలియాడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనకు సంబంధించి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో పంచాయతీ కార్యదర్శి సుంకరి విక్రమ్ కుమార్ గౌడ్ నుంచి పోలీసులకు ఫిర్యాదు అందింది. అదే రోజు ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో కూకట్‌పల్లి నివాసి ఎం.డి. సలావుద్దీన్ జాఫర్‌గూడ గ్రామ చెరువులో ఓ గుర్తుతెలియని పురుషుడి మృతదేహం తేలియాడుతున్నట్లు సమాచారం అందించగా, పంచాయతీ కార్యదర్శి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చెరువులో సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, మృతుడి గుర్తింపు కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి వెల్లడించారు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం స్పష్టమవుతాయని, మృతుడి ఆచూకీ తెలిసిన వారు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులను సంప్రదించాలని కోరారు. ప్రస్తుతం పోలీసులు అనుమానాస్పద మృతి కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు.

## రక్తదానంతో ప్రాణాలు కాపాడిన ఐబీఎస్ హైదరాబాద్ విద్యార్థులు

**సమాజ సేవలో ముందంజలో ఐబీఎస్ .. మెగా బ్లడ్ డొనేషన్ డ్రైవ్ విజయవంతం**



**చేవెళ్ల, విశాలభారతి :** సమాజ సేవలో మరో మైలురాయిని చేరుకుంటూ ఐసీఎఫ్ఏఐ బిజినెస్ స్కూల్ (ఐబీఎస్), హైదరాబాద్ ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విశేష స్పందనతో విజయవంతమైంది. పుస్తకాలు, తరగతి గదులకే పరిమితం కాకుండా, సమాజంలో ప్రాణాలను కాపాడే సేవలో ముందుండి విద్యార్థులు తమ బాధ్యతను చాటిచెప్పారు. ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఐఎఫ్ హెచ్ఈ ) ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరం, నిలోఫర్ ఆసుపత్రి మరియు ఇండియన్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఐ డి ఎఫ్ ) సహకారంతో ఘనంగా జరిగింది. ఐబీఎస్‌కు చెందిన "క్లబ్ సంకల్ప్" ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని మరింత పెంచింది. ప్రొఫెసర్ మాధవి గరికపర్తి మార్గదర్శకత్వంలో విద్యార్థి నాయకులు సమర్థవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించగా, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రక్తదాన కేంద్రం వద్ద కనిపించిన భారీ క్యూలు, అవసరమైన వారికి ప్రాణదానం చేయాలనే తపనను ప్రతిబింబించాయి. నిలోఫర్ ఆసుపత్రి వైద్య బృందాలు రక్తదాన ప్రక్రియను క్రమబద్ధంగా నిర్వహించగా, ఐ డి ఎఫ్ ప్రతినిధులు విద్యార్థుల సేవాభావాన్ని ప్రశంసించారు. మహిళలు, చిన్నారుల ప్రాణాలను కాపాడడంలో ఈ రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందని వారు పేర్కొన్నారు. సమాజ అవసరాలను గుర్తించి వెంటనే స్పందించే లక్షణం, మానవతా దృక్పథంతో కూడిన నాయకత్వం ఐబీఎస్ హైదరాబాద్ విద్యార్థుల్లో స్పష్టంగా కనిపించిందని నిర్వాహకులు తెలిపారు. నిజమైన విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, సమాజానికి సేవ చేయడంలోనే ఉందని ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది.

## మైలార్దేవ్ పల్లిలో కొత్త శిశు మందిర్ ప్రారంభం

**ముఖ్య అతిథిగా ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి**





**రాజేంద్రనగర్, విశాల భారతి:** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్దేవ్‌పల్లి గ్రామంలో నూతనంగా స్థాపించిన శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్లే స్కూల్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గౌరవనీయులు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి , శిశు మందిరం స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. శ్రీనివాస్ హాజరై స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యాసంస్థలు విలువల ఆధారిత విద్యను అందించడంలో ప్రత్యేక గుర్తింపు పొందాయని తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో శ్రీ సరస్వతి విద్యాపీఠం మార్గదర్శకత్వంలో నడుస్తున్న ఈ పాఠశాలలు నైతిక విలువలు, సంస్కృతి మరియు ప్రస్తుత సిలబస్‌లను సమన్వయం చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని పేర్కొన్నారు. చిన్నారులలో మంచి నడవడి, భాషా ప్రావీణ్యం మరియు దేశభక్తి పెంపొందించడంలో ఈ పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నైతిక విలువలు నేర్పించే ఇలాంటి శిశు మందిర్ పాఠశాలలో చేర్పించాలని, మంచి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ నవారు మురళీధర్ రెడ్డి , ఇంచార్జి భూషణం , స్కూల్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ భార్గవ్ , దేవాలయ కమిటీ ప్రెసిడెంట్ అకెమ్ కృష్ణ యాదవ్ గారు, స్కూల్ హెడ్ మాస్టర్ సరస్వతి , నాగరాజు , సుభాష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక సీనియర్ నాయకులు, డివిజన్ ప్రెసిడెంట్ పాండు యాదవ్, రావుల భాస్కర్, సంతు గౌడ్, అడికి జనార్ధన్, పవన్ యాదవ్ భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బాటసింగారం ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లకు విశేష స్పందన




- **ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకరాచారి**
- **ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి : సర్పంచ్**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రతాప్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో కొత్త అడ్మిషన్ల కోసం విస్తృత స్థాయిలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకరాచారి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకరాచారి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గత విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 98.55 శాతం ఉత్తీర్ణత సాధించడం గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు విశ్వాసం పెంచుకుని తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించాలని కోరారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రతాప్ మాట్లాడుతూ.. పాఠశాలలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కంప్యూటర్ విద్య, ఇతర సహపాఠ్య కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంతో పాటు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు అందజేస్తోందని, రానున్న విద్యా సంవత్సరం నుంచి అల్పాహారం, పాలు, రాగి జావ వంటి పోషకాహారం కూడా అందించనున్నట్లు తెలిపారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యార్థులు క్రీడల్లో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబర్చారని గుర్తు చేశారు. గ్రామంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని, సుమారు 20 మంది విద్యార్థులు కొత్తగా ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు ఆసక్తి వ్యక్తం చేశారని వెల్లడించారు. గ్రామంలోని బడీడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న నాణ్యమైన విద్యా అవకాశాలను వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పి ఈ టి సొలపోగుల స్వాములు,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## పలు సమస్యలతోకూడిన కరపత్రాల ఆవిష్కరణ




- **ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కరపత్రాల విడుదల**
- **ఇళ్ల స్థలాలు, ఇంద్రమ్మ ఇల్లు మంజూరు కై డిమాండ్**
- **నిరుద్యోగ భృతి 3000 చెల్లించాలి**
- **నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి**
- **పెండింగ్ స్కాలర్షిప్లు విడుదల చేయాలి**
- **ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన కరపత్రం విడుదల**
- **కొత్తగూడెంలో జరుగు సభను జయప్రదం చేయండి అని పిలుపు**

**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం పట్టణంలోని హరిత టూరిజం లో ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల సాధనకై నిర్వహించే సభ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మహాజన సమితి అధ్యక్షులు గడ్డం సుధాకర్ రావు. ఏజెన్సీ ప్రజా సంక్షేమ సంఘం.ఆర్గనైజింగ్ కార్యదర్శి కనకం శ్రీమన్నారాయణ. యువజన సంక్షేమ సమితి అధ్యక్షులు చింత నాగ ముత్యం. సంఘాల నాయకులు కరపత్రం విడుదల చేసిన అనంతరం వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు వాదంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు విశేషంగా కృషి చేశారని అనేక కార్యక్రమాలు క్రియాశీలక పాత్ర పోషించారని వారు గుర్తు చేశారు. అటువంటి క్రియాశీలక పాత్ర పోషించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజానీకానికి అభివృద్ధి చేయటంలో ప్రభుత్వం విఫలమైందని వారు పేర్కొన్నారు. బడుగు జీవులకు సెంటు జాగ కూడా లేదని అటువంటి వారికి స్థలం కేటాయించి వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని వారు అన్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో నివసిస్తున్న నిరుద్యోగులు ఉద్యోగం లేక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని వారికి తక్షణమే ప్రభుత్వ నిరుద్యోగ భృతి 3000 అందించాలని నిరుద్యోగులుగా ఉన్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి పదోన్నతులు ఇవ్వాలని వారు అన్నారు. పేద విద్యార్థులు స్కాలర్షిప్ల మీద ఆధారపడి చదువుతున్నారని అటువంటి పేద విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్షిప్‌లను విడుదల చేయకపోవడం వలన చదివేందుకు ఆటంకంగా మారిందని వారు ఆవేదన వ్యక్తపరిచారు ప్రభుత్వం వెంటనే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లను మంజూరు చేసి చదువుకి సహకరించాలని వారు కోరారు. అంతేకాకుండా భద్రాచలం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అనంతరం పూర్తిగా నష్టపోయిందని జాగా లేక చెత్త పోసుకునే పరిస్థితి కూడా భద్రాచలానికి లేని పరిస్థితి ఉందని శ్రీరాములవారి భూములు ఆంధ్రాలో ఉన్నాయని ఒక్క భద్రాచలం పట్టణం లో శ్రీరాములవారి ఆలయం మాత్రమే ఉందని దాని ద్వారా ఈ పుణ్యక్షేత్రం అభివృద్ధికి నోచుకోవట్లేదని వారు అన్నారు. ఆంధ్రలో కలిసిన ఐదు పంచాయతీలు ప్రజలు పరిపాలన సౌలభ్యం లేకపోవడం వలన అనేక అవాంతరాలు ఎదుర్కొంటున్నారని తక్షణమే ఇరురాష్ట్రాల ప్రభుత్వాలు పునర్ ఆలోచన చేసి ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపి భద్రాచలాన్ని అభివృద్ధి చేయాలని ఈ ఐదు పంచాయతీల ప్రజల సమస్యను పరిష్కరించి భద్రాచలన్ని పూర్వ వైభవాన్ని తీసుకురావాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఈ సమస్యల సాధన కోసం ఈనెల 29 నా కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కి వినతి పత్రాల ద్వారా జిల్లా సమస్యలపై విన్నవిస్తారని వారు ఈ సందర్భంగా తెలిపారు.

# ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

**అఖిలపక్షం ఆధ్వర్యంలో వివేకానంద చౌరస్తాలో ధర్నా**



**ఆర్మూర్, విశాల భారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ ను రద్దుచేసి పాత పద్ధతిలోనే పంపిణీ చేయాలని సోమవారం నందిపేట్ మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో రైతు అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నిరసన వ్యక్తం చేశారు. ఈ ధర్నాకు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు నూతుల శ్రీనివాస్ రెడ్డి సంఘీభావం తెలిపారు. అనంతరం రైతులతో ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ యూరియా యాప్ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులు యూరియా ఏ విధంగా బుక్ చేసుకోవాలని ప్రశ్నించారు, అదేవిధంగా రైతులు యూరియా యాప్ లో యూరియాను బుక్ చేయాలని చూస్తే ఐదు నిమిషాలలో బుక్ అయిపోయి స్టాక్ లేనట్లుగా ఆన్లైన్లో చూపిస్తుందని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే యాప్ ను రద్దుచేసి పాత పద్ధతిలో పంపిణీ చేయకపోతే తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేసి అసెంబ్లీని ముట్టడి చేస్తామని అన్నారు. వానాకాలం కు సంబంధించిన యూరియా నిల్వలను రైతులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

**తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేసిన నాయకులు**

వివేకానంద చౌరస్తా వద్ద ధర్నాకు దిగిన రైతుల వద్దకు నందిపేట తాసిల్దార్ సంతోష్ రెడ్డి మరియు వ్యవసాయ అధికారి రైతులతో మాట్లాడారు. ఇట్టి సమస్యను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. రైతు నాయకులు తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ , నందిపేట్ డొంకేశ్వర్ మండల రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిందితున్ని కఠినంగా శిక్షించాలి.. తన్నీరు రామ్ ప్రభు



**తిరుమలగిరి,విశాలభారతి :** ఖమ్మం జిల్లాలోని ఏడో తరగతి చదువుతున్న రజక సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తిరుమలగిరి మండల తాహసిల్దార్ హరి ప్రసాద్ కు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు మాట్లాడుతూ అభం శుభం తెలియని మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడమే కాకుండా,మూడంతస్తుల బిల్డింగ్ నుండి నెట్టి వేయడంతో నిస్సహాయ స్థితిలో పడిపోయింది దానితో అక్కడ ఉన్నటువంటి జనం ఆ మైనర్ బాలికను ఆసుపత్రిలో అడ్మిట్ చేయడం జరిగిందని, మైనర్ బాలిక పై అత్యాచారానికి పాల్పడిన మహమ్మద్ గౌస్ పాషాను కఠినంగా శిక్షించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేసి వారిపై ఫోక్సో కేసు నమోదు చేసి ఉరితీయాలని డిమాండ్ చేశారు. నడవలేని స్థితిలో ఉన్నటువంటి మైనర్ బాలికకు నాణ్యమైన వైద్యం అందించాలని, మైనర్ బాలిక తో పాటు తల్లిదండ్రులకు భద్రత కల్పించాలని తన్నీరు రాంప్రభు డిమాండ్ చేశారు. అత్యాచారానికి గురైన బాలికకు రాష్ట్ర ప్రభుత్వము 50 లక్షలు నష్టపరిహారంతో పాటు, స్పెషల్ పెన్షన్ కింద నెలనెలా 50 వేల రూపాయలు ఇవ్వాలని, వారి ఇంటిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, వారికి సొంత ఇల్లు కూడా లేదని ఆ కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని , ఈ ఘటనపై ప్రతి ఒక్కరు స్పందించాలని రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ బాలికకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు వంగరి బ్రహ్మం, పులిమామిడి సోమయ్య, బూర్గుల ప్రభాకర్, సుంకర కిరణ్, సోమరాజు,గూడూరు వెంకన్న, అంబాటి మహేష్ గౌడ్, కాసాని శ్యామ్ యాదవ్, ముద్దంగుల యాదగిరి, పులిమామిడి బిక్షం, జంపాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# జడ్జిల నియామకాల్లో తెలంగాణ అడ్వకేట్స్‌కు ప్రాతినిధ్యం ఇవ్వాలి

- **తెలంగాణ అడ్వకేట్స్ అసోసియేషన్ డిమాండ్**
- **అధ్యక్షుడు సురేందర్ రెడ్డి నేతృత్వంలో ఏకగ్రీవ తీర్మానం**
- **సామాజిక న్యాయం, సముచిత ప్రాతినిధ్యంపై సీనియర్ న్యాయవాదుల గళం**



**హైదరాబాద్:** హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో తెలంగాణకు చెందిన అర్హులైన న్యాయవాదులకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం ప్రతిబింబించేలా న్యాయవ్యవస్థ ఉండాలని స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. సురేందర్ రెడ్డి అధ్యక్షతన సోమవారం తెలంగాణ హైకోర్టులో జరిగిన అత్యవసర సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం ఆమోదించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు డి.ఎల్. పాండు, కార్యదర్శులు పీ. శ్రవణ్ కుమార్ గౌడ్, కె. నిరంజన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి పీ. కృష్ణ కీర్తన, ఖజాంచి బి. బాలాజీ, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శి జె. విష్ణువర్ధన్ తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. హైకోర్టు బెంచ్‌కు ఎంపిక చేసే న్యాయమూర్తుల నియామకాల్లో సామాజిక న్యాయాన్ని పాటించడంతో పాటు అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని సమావేశం అభిప్రాయపడింది. తెలంగాణలో ప్రతిభావంతులు, అనుభవజ్ఞులు, నిబద్ధత కలిగిన న్యాయవాదులు ఎంతోమంది ఉన్నారని, వారికి తగిన గుర్తింపు దక్కాల్సిన అవసరం ఉందని సీనియర్ న్యాయవాదులు వెల్లడించారు. న్యాయమూర్తుల ఎంపికలో కేవలం ప్రతిభ మాత్రమే కాకుండా ప్రాంతీయ ఆకాంక్షలు, ప్రజల భావోద్వేగాలు, సమగ్ర ప్రాతినిధ్యం కూడా పరిగణనలోకి తీసుకోవాలని వారు సూచించారు. ఈ అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు కొలీజియం సభ్యులు, కేంద్ర న్యాయశాఖ మంత్రి, తెలంగాణ గవర్నర్, ముఖ్యమంత్రి, అలాగే వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులకు వినతిపత్రాలు సమర్పించాలని అసోసియేషన్ నిర్ణయించింది. దాంతోపాటు, న్యాయమూర్తుల నియామకాల్లో పారదర్శకత, న్యాయం, తెలంగాణకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ జూన్ 17న తెలంగాణ హైకోర్టు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించింది. "ప్రజల వైవిధ్యం, ఆకాంక్షలు, సామాజిక వాస్తవాలు న్యాయవ్యవస్థలో ప్రతిబింబించాలి. తెలంగాణకు హైకోర్టు బెంచ్‌లో సముచిత ప్రాతినిధ్యం దక్కాల్సిందే" అని అసోసియేషన్ తన తీర్మానంలో స్పష్టం చేసింది.

# గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



**భద్రాచలం ,విశాల భారతి;** భద్రాచలం శాఖా గ్రంథాలయానికి ఆధునిక పద్య సాహిత్యానికి సంబంధించి వివిధ రచయితలు, కవులు రాసిన 50 పుస్తకాలను గ్రీన్ భద్రాద్రి అధ్యక్షురాలు, ప్రముఖ రచయిత్రి చిట్టే లలిత గ్రంథాలయ పాలకుడు జానీ కి అందచేశారు. త్వరలో మరో 100 పుస్తకాలు గ్రంథాలయానికి అందచేస్తానని చిట్టే లలిత తెలిపారు. భద్రాచలం లైబ్రరీ అభివృద్ధికి గ్రంథ పాలకుడు జానీ చేస్తున్న విశిష్ట సేవలు అభినందనీయం అన్నారు. పుస్తకాలు వితరణ గా అందించిన చిట్టే లలిత కు గ్రంథ పాలకుడు జానీ, గ్రంథాలాయానికి వచ్చే పాఠకులు అభినందనలు తెలిపారు

# కొత్త రాజకీయ వేదికలు ప్రత్యామ్నాయమా.. ప్రాక్సీలా?

**భారత రాజకీయాల్లో యువత ఎప్పుడూ ఒక శక్తిగానే ఉంది. దేశ భవిష్యత్తును, మార్పును తీసుకువచ్చే వర్గంగా యువతను ప్రతి రాజకీయ పార్టీ చూసింది. వారి ఆశలు, ఆకాంక్షలు, అసంతృప్తి, ఆవేశం — ఇవన్నీ రాజకీయ మార్పులకు ఇంధనంగా మారిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అయితే ప్రతి ఉద్యమం వెనుక ఉన్న అసలు లక్ష్యం ఏమిటి? యువత కోసం మొదలైన ఉద్యమాలు చివరకు ఎవరికి లాభం చేకూర్చాయి? అనే ప్రశ్నలను కూడా చరిత్ర మన ముందుంచుతోంది. తాజాగా మరోసారి దేశ రాజకీయాల్లో కొత్త తరహా రాజకీయ వేదికలు తెరపైకి వస్తున్నాయి.**



"యూత్ మూవ్‌మెంట్", "యాంటీ సిస్టమ్", "కొత్త ప్రత్యామ్నాయం" వంటి నినాదాలతో యువతను ఆకర్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన "కాక్రోచ్ జనతా పార్టీ" కూడా అలాంటి రాజకీయ ప్రయోగాల్లో భాగమేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు చిన్నవి కావు. నిరుద్యోగం పెరుగుతోంది, ఉద్యోగాల కోసం పోటీ తీవ్రమవుతోంది, పరీక్షల ప్రశ్నపత్రాల లీకులు వరుసగా వెలుగుచూస్తున్నాయి, విద్య ఖరీదైన వ్యవహారంగా మారుతోంది, సామాజిక, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. వీటన్నింటి మూలంగా సహజంగానే యువతలో అసంతృప్తి పెరుగుతోంది. అయితే అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది. యువతలోని ఈ అసంతృప్తిని నిజమైన వ్యవస్థ మార్పు కోసం ఉపయోగిస్తున్నారా? లేక దానిని రాజకీయ మూలధనంగా మార్చి మరొక రాజకీయ లక్ష్యానికి ఇంధనంగా ఉపయోగిస్తున్నారా? దేశ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే ఇలాంటి ఉదాహరణలు కొత్తవి కావు. 2011లో అన్నా హజారే ఉద్యమం అవినీతి వ్యతిరేక పోరాటంగా ప్రారంభమైంది. కోట్లాది మంది యువత ఆ ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. కానీ ఆ ఉద్యమం తర్వాత భారత రాజకీయాల్లో చోటుచేసుకున్న పరిణామాలు, దాని రాజకీయ ఫలితాలు ఇప్పటికీ చర్చనీయాంశాలుగానే ఉన్నాయి. అందుకే నేడు "పేపర్ లీకులు", "యూత్ జస్టిస్", "సిస్టమ్ ఫెయిల్యూర్", "స్కామ్స్" వంటి నినాదాలతో ముందుకు వస్తున్న కొత్త రాజకీయ వేదికలను కూడా విమర్శనాత్మకంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**ఏ రాజకీయ వేదిక అయినా కొన్ని ప్రాథమిక ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.**

దేశ ఆర్థిక విధానంపై దాని అభిప్రాయం ఏమిటి?, సామాజిక న్యాయం పట్ల దాని కట్టుబాటు ఎంత?, రాజ్యాంగ విలువల పట్ల దాని వైఖరి ఏమిటి?, మతతత్వ రాజకీయాలను అది ఎలా చూస్తోంది?, కార్పొరేట్ ఆధిపత్యంపై దాని అభిప్రాయం ఏమిటి? కానీ ప్రస్తుతం సోషల్ మీడియా కేంద్రంగా ఎదుగుతున్న అనేక రాజకీయ వేదికలు ఈ ప్రశ్నలకు దూరంగా ఉంటున్నాయి. స్పష్టమైన సిద్ధాంతం కంటే భావోద్వేగ ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. నినాదాలు వినిపిస్తున్నాయి కానీ విధానాలు కనిపించడం లేదు. విమర్శలు వినిపిస్తున్నాయి కానీ ప్రత్యామ్నాయ దారి ఏమిటో చెప్పడం లేదు. భారత రాజకీయాల్లో తరచూ ఒక ఆసక్తికర ధోరణి కనిపిస్తుంది. కొన్ని వేదికలు తమను తాము "తటస్థం"గా ప్రకటించుకుంటాయి. అన్ని రాజకీయ పార్టీలను ఒకే తీరుగా విమర్శిస్తాయి. "అందరూ ఒకటే", "ఎవరినీ నమ్మలేం", "కొత్త ప్రత్యామ్నాయం కావాలి" అనే భావనను ప్రజల్లో, ముఖ్యంగా యువతలో బలంగా నాటేందుకు ప్రయత్నిస్తాయి. ఇలాంటి వేదికలు మొదట్లో ఆకర్షణీయంగా కనిపించవచ్చు. వ్యవస్థపై ఉన్న కోపాన్ని, నిరాశను తమవైపు తిప్పుకోవడంలో కొంతవరకు విజయవంతమవుతాయి కూడా. కానీ అసలు ప్రశ్న మాత్రం అలాగే మిగిలిపోతుంది. ఇవి నిజంగా స్వతంత్ర రాజకీయ శక్తులా? లేక ఇప్పటికే ఉన్న ఏదైనా రాజకీయ శక్తికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉపయోగపడే వేదికలా?

చరిత్ర చెబుతున్న పాఠం ఏమిటంటే, ప్రతి కొత్త వేదికను దాని నినాదాల ద్వారా కాకుండా, దాని రాజకీయ దిశ ద్వారా అంచనా వేయాలి. అది ఎవరిని విమర్శిస్తోంది అనేది ఎంత ముఖ్యమో, ఎవరిని విమర్శించడం లేదు అనేది కూడా అంతే ముఖ్యం. ఎందుకంటే రాజకీయాల్లో మౌనం కూడా ఒక సందేశమే. సోషల్ మీడియా యుగంలో రాజకీయాల స్వరూపం వేగంగా మారుతోంది. వైరల్ వీడియోలు, డిజిటల్ ప్రచారం, ఇన్‌ఫ్లుయెన్సర్ల మద్దతు, కృత్రిమ మేధ ఆధారిత కంటెంట్ — ఇవన్నీ కలిసి చాలా తక్కువ సమయంలో ఒక వేదికను దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మార్చగలుగుతున్నాయి. కానీ వైరల్ కావడం ప్రజా ఉద్యమానికి ప్రమాణం కాదు. ట్రెండింగ్ హ్యాష్‌ట్యాగ్ ప్రజల విశ్వాసాన్ని సూచించదు. లక్షల వ్యూస్ సామాజిక అంగీకారానికి కొలమానం కావు. నిజమైన ఉద్యమం అంటే ప్రజల మధ్య నిరంతర పని, స్పష్టమైన సిద్ధాంతం, ప్రజల సమస్యలపై దీర్ఘకాల పోరాటం, త్యాగం, ప్రజా విశ్వాసం. ఈ నేపథ్యంలో దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక, రాజ్యాంగ విలువలను విశ్వసించే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థియువజన సంస్థలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వాస్తవానికి యువతలో ఉన్న అసంతృప్తి నిజమే. వారి ఆవేదన వాస్తవమే. కానీ ఆ ఆవేదనను రాజకీయంగా ఎవరు ఉపయోగించుకుంటున్నారు? దాని తుది లబ్ధిదారులు ఎవరు? అనే ప్రశ్నలకు సమాధానం వెతకడం కూడా అంతే అవసరం. భారతదేశానికి ఈరోజు అవసరమైంది వైరల్ నినాదాలు కాదు. నిజమైన ఉపాధి అవకాశాలు, నాణ్యమైన విద్య, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, మత సామరస్యం, ఆర్థిక సమానత్వం, యువత భవిష్యత్తుకు భరోసా. ఈ ప్రధాన అంశాలపై చర్చ జరగాల్సిన సమయంలో ప్రజల దృష్టిని కేవలం భావోద్వేగ ప్రచారాల వైపు మళ్లించడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ప్రజాస్వామ్యంలో కొత్త రాజకీయ శక్తులు రావడం సహజం. వాటిని ముందుగానే తిరస్కరించడం కూడా సరైంది కాదు. కానీ ప్రశ్నించకుండా అంగీకరించడం మరింత ప్రమాదకరం. అందుకే ప్రతి కొత్త వేదికను దాని నినాదాల ద్వారా కాదు, దాని నాయకత్వం ద్వారా, దాని సిద్ధాంతం ద్వారా, దాని రాజకీయ సంబంధాల ద్వారా, దాని సామాజికఆర్థిక దృక్పథం ద్వారా అంచనా వేయాలి. యువత మార్పు కోసం పోరాడాలి. కానీ ఆ పోరాటం ఎవరి రాజకీయ ప్రాజెక్టుకు బలం చేకూరుస్తుందో కూడా అర్థం చేసుకోవాలి. భావోద్వేగం అవసరం, ఆవేశం అవసరం, మార్పు పట్ల తపన అవసరం. కానీ వాటన్నింటికంటే ముఖ్యమైనది రాజకీయ స్పష్టత. ఎందుకంటే చరిత్ర ఒక విషయాన్ని పదేపదే చెబుతోంది. సిద్ధాంతం లేని కోపం చివరికి ఎవరో ఒకరి రాజకీయ ప్రయోజనాలకు ఆయుధంగా మారుతుంది.

అందుకే యువతకు ఒకే సందేశం — ప్రశ్నించండి, పరిశీలించండి, ఆలోచించండి. నిజమైన సమస్యల కోసం పోరాడండి. కానీ ఎవరి ప్రాక్సీ రాజకీయాలకు సాధనంగా మారవద్దు. ప్రజాస్వామ్యానికి చైతన్యవంతమైన యువత అవసరం; భావోద్వేగాలకు బందీ అయిన యువత కాదు.

**డా. డి. నరేశ్**
**సామాజిక విశ్లేషకులు**

## డాక్టర్ ఎం.వి. కోటిరెడ్డికి ఘనంగా

# పదవీ విరమణ సన్మానం



**భద్రాచలం , విశాలభారతి:**

భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో సుదీర్ఘకాలం పాటు విశేష వైద్య సేవలను అందించి, ప్రజల గుండెల్లో అపారమైన అభిమానాన్ని సంపాదించుకున్న డాక్టర్ ఎం.వి. కోటిరెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం రాఘవ నిలయం భద్రాచలంలో అత్యంత ఘనంగా జరిగింది. భద్రాచలం రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సన్మాన మహోత్సవంలో పలువురు వైద్యులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, మిత్రులు మరియు ఆయన కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ కోటిరెడ్డి సేవలను కొనియాడారు. వైద్య రంగంలో ఆయన అందించిన విశిష్ట సేవలు, ఆయనకున్న నిరాడంబర వ్యక్తిత్వం మరియు రోగుల పట్ల ఆయన చూపిన అంకితభావాన్ని వక్తలు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా పలువురు రెడ్డి సోదరులు మాట్లాడుతూ... "ఏజెన్సీ ప్రాంతమైన, గిరిజనులు, పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించే ఈ భద్రాచలంలో, నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంత ప్రజలకు డాక్టర్ కోటిరెడ్డి గత 12 సంవత్సరాలుగా వేలాది మంది రోగులకు నాణ్యమైన వైద్యం అందించి ప్రజల గుండెల్లో నిలిచారు. ఈ ఘనత ఒక్క డాక్టర్ కోటిరెడ్డికే దక్కుతుంది" అని కొనియాడారు. ఇంతటి మంచి పేరు తెచ్చిన కోటిరెడ్డి తల్లిదండ్రులకు వక్తలు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు. అనంతరం డాక్టర్ కోటిరెడ్డి దంపతులను గజమాలతో, శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులందరూ ఆయన పదవీ విరమణ జీవితం సుఖసంతోషాలతో, ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని ఆ రామచంద్ర మహాప్రభువును ఆకాంక్షిస్తూ ప్రార్థించారు. ఈ కార్యక్రమం భద్రాచలం రెడ్డి భవన్ కన్వీనర్ మందపాటి సుధాకర్ రెడ్డి, ఈసీ మెంబర్ బోగాల శ్రీనివాస్ రెడ్డి, ఆడిట్ మెంబర్ జి.వి. రమణా రెడ్డి, సభ్యులు క్వెస్ట్ రాజా రెడ్డి మరియు మారం వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెడ్డి ప్రముఖులు బూసిరెడ్డి శంకర్ రెడ్డి, గాదె మాధవ రెడ్డి, బిలిపెల్లి రంగారెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బి.వి. రమణా రెడ్డి, మోర్తాల సిద్ధారెడ్డి, రామకృష్ణ రెడ్డి, సిపిఎం పార్టీ బాల నర్సారెడ్డి, జక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ రామిరెడ్డి, అన్నెం కోటి రెడ్డి, సూర్య హాస్పటల్ జయచంద్రా రెడ్డి, శ్రీధర్ రెడ్డి, చైతన్య రెడ్డి,బి.ఆర్.టి.యు. జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్ రెడ్డి పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఏరియా హాస్పిటల్ సుపెరిడెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ నరసింహ రెడ్డి, డాక్టర్ శేషారెడ్డి, డాక్టర్ యుగంధర్ రెడ్డి, డాక్టర్ సుకృత, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ పవన్ రెడ్డి, గీతా పావని, , డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ సాయి తేజ్ రెడ్డి దంపతులు మరియు రెడ్డి నియోజకవర్గ సోదర సోదరీమణులు దంపతులతో సహా పాల్గొని కోటిరెడ్డి కి నిండు నూరేళ్లు వర్ధిల్లాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

# శంషాబాద్‌లో వృద్ధుడి అనుమానాస్పద మృతి

**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్ మండలం ముచింతల్ గ్రామంలో ఓ వృద్ధుడు పురుగుమందు సేవించి మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన జొన్నడ నారాయణ (78) ఇటీవల ఇంటి వద్ద జారి పడడంతో ఎడమ కాలు విరిగింది. దీంతో ఆయన గత 20 రోజులుగా మంచానికే పరిమితమయ్యాడు. కుటుంబ సభ్యులు చెర్లపల్లిలో చికిత్స చేయిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో జూన్ 1న రాత్రి కుటుంబ సభ్యులందరూ భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. అయితే జూన్ 2 తెల్లవారుజామున సుమారు 1.30 గంటల సమయంలో నారాయణ దగ్గుతున్న శబ్దం వినిపించడంతో అతని పెద్ద కుమారుడు అక్కడికి వెళ్లి చూడగా పురుగుమందు వాసన వచ్చిందని గుర్తించారు. పక్కనే 'అజిల్' అనే గడ్డి మందు సీసా కనిపించడంతో కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జూన్ 11న గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ జూన్ 14న మధ్యాహ్నం 3.39 గంటల సమయంలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాలు విరిగిపోవడంతో స్వయంగా పనులు చేసుకోలేని స్థితిలో ఉండటం వల్ల మనస్తాపానికి గురై నారాయణ పురుగుమందు సేవించి ఉండవచ్చని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఈ ఘటనపై ఎవరిపై కూడా అనుమానం లేదని వారు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న శంషాబాద్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# ప్రజావాణిలో హరితహారంపై వినతి



**సైబరాబాద్ విశాల భారతి:** హరితహారం కార్యక్రమం కింద మదీనాగూడ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని మిద్దెల మల్లారెడ్డి కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మియాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం జూన్ నెల వర్షాకాలం కావడంతో మొక్కలు నాటడానికి అనుకూలమైన సమయమని వివరించారు. హుడా కాలనీలో పలుచోట్ల ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయని, వాటిని శుభ్రం చేసి స్థానిక ప్రజల భాగస్వామ్యంతో భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల పచ్చదనం పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఘనంగా భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

- **భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలకు శ్రీకారం**
- **ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ**
- **ప్రజా సంక్షేమం కోసం భట్టి విక్రమార్క చేస్తున్న కృషిని కొనియాడిన నాయకులు**



**విశాలభారతి , అశ్వారావుపేట:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టి భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ముందుగా అశ్వారావుపేట రింగ్ రోడ్డులోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద భారీ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సమక్షంలో కేక్ కట్ చేసి వారికి పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా కాంగ్రెస్ పార్టీ సేవా దృక్పథాన్ని చాటుకుంది. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు బండారు మహేష్, అశ్వారావుపేట ఆర్యవైశ్య సంఘ బాధ్యులు మరియు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జల్లిపల్లి దేవరాజు, అశ్వారావుపేట మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు తమ్మిశెట్టి పోసి, మండల సేవాదళ్ కార్యదర్శి సుకూర్, కొప్పుల శ్రీను, ఎస్టీ సెల్ నాయకులు సింహాచలం, మాడి గంగరాజు, మధు, రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషిని కొనియాడుతూ నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# చిన్న పెట్టుబడితో గాలం... లక్షల్లో టోకరా



**సైబరాబాద్ విశాల భారతి:** టెలిగ్రామ్ గ్రూపులు, నకిలీ ట్రేడింగ్ యాప్ ల ద్వారా సైబర్ మోసాలు పెరుగుతున్నాయని సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డిసిపి టి. సాయి మనోహర్ తెలిపారు. సోషల్ మీడియా, టెలిగ్రామ్ ద్వారా "రోజుకు వేల రూపాయల ఆదాయం", "టాస్క్ లకు భారీ కమిషన్" అంటూ బాధితులను గ్రూపుల్లోకి చేర్చుకుంటారు. ముందు వందలు, వేల రూపాయలు పెట్టించి కొంత లాభం చూపి నమ్మకం కల్పిస్తారు. ఆ తర్వాత లక్షల్లో పెట్టుబడి పెట్టిస్తారు. డబ్బు విత్ డ్రా చేయాలంటే "ట్యాక్స్ క్లియరెన్స్", "వీఐపీ అప్ గ్రేడ్", "సెక్యూరిటీ డిపాజిట్" పేరుతో మళ్లీ డబ్బు అడుగుతారు. ఖాతాలో లాభాలు కనిపిస్తాయి కానీ ఒక్క రూపాయి రాదు. చివరకు బ్లాక్ చేస్తారు. **సూచనలు:** అధిక లాభాల ఆఫర్లు నమ్మవద్దు. ముందు డబ్బు అడిగే ఉద్యోగాలు టాస్కులు తిరస్కరించండి. తెలియని లింకులు, యాప్ లపై నమోదు వద్దు. విత్ డ్రాకు అదనపు ఫీజు అడిగితే అది మోసమే. మోసపోతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేయాలని డిసిపి సూచించారు.



# మా ఇంటి బంగారం ఈవెంట్‌లో సమంత

సమంత ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వయంగా నిర్మించిన వినూత్న చిత్రం 'మా ఇంటి బంగారం' జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ /ట్రైలర్ లాంచ్ వేడుకలో సమంత చాలా ఓపెన్‌గా, ఎమోషనల్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ.. "నిజం చెప్పాలంటే ఒక ఏడాదిలో కనీసం రెండు సినిమాలు చేయాలని నాకూ ఉంటుంది. కానీ ఈ ఒక్క సినిమాను మాత్రం ప్రాణం పెట్టి చాలా బాగా చేశాం. అది నా ప్రామిస్. జూన్ 19న మీరే థియేటర్లలో చూస్తారుగా.. ఈ సినిమాతో మనం ఒక్కొక్కరిని కొడతాం చూడు.. ఆ రేంజ్‌లో ఉంటుంది" అంటూ సినిమాపై తనకున్న నమ్మకాన్ని గట్టిగా వ్యక్తపరిచారు. నిర్మాతగా తన అనుభవాన్ని పంచుకుంటూ.. "లాస్ట్ ఫైవ్ డేస్ ప్రొడ్యూసర్‌కుఎంత స్ట్రెస్ ఉందో నాకు పూర్తిగా అర్థమైంది. ఇప్పటిదాకా ఒక యాక్టర్ గా చాలా హాయిగా నా లైఫ్ లివ్ చేశాను. సాధారణంగా సినిమా హిట్ అయితే ఆ క్రెడిట్ అంతా యాక్టర్స్, డైరెక్టర్లకే దొరుకుతుంది. కానీ రాత్రింబవళ్లు కష్టపడి సినిమాను సక్సెస్ చేసే నిజమైన వ్యక్తులకు థాంక్స్ చెప్పడానికి నేను ఈ స్టేజ్ వాడుకోవాలనుకుంటున్నాను" అని అన్నారు. "లాస్ట్ వన్ వీక్‌గా మా అసిస్టెంట్ డైరెక్టర్లు మహేష్, శీను, అన్వేష్, వంశీ, కుశాల్.. అస్సలు నిద్రపోలేదు, కనీసం ఇంటికి కూడా వెళ్ళలేదు. శీను అయితే ఇప్పుడు కూడా మిక్సింగ్‌లోనే ఉన్నారు. వసంత్, ప్రహాస్ రాసిన డైలాగ్స్ ఈ సినిమాకు పెద్ద ప్లస్. ఈ సినిమాలో నేను నాచురల్ గా పర్ఫార్మ్ చేశానంటే.. అందులో సగం క్రెడిట్ ఈ డైలాగ్స్‌దే. వివిఎఫ్ఎక్స్ నిఖిల్, ఎడిటర్ ధర్మేంద్ర గారు, సౌండ్ మిక్సింగ్ అజిత్ గారు డే అండ్ నైట్ పనిచేశారు. పల్లవి డిజైన్ చేసిన శారీ కట్టుకుని యాక్షన్ సీక్వెన్స్ చేయడం చాలా కష్టమైంది. హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రఫర్ లీ విటకర్ ఈ సినిమాలో ఎక్స్‌ట్రార్డినరీ యాక్షన్ సీన్స్ డిజైన్ చేశారు. టీజర్‌లో చూసింది శాంపిల్ మాత్రమే.. అసలు యాక్షన్ సినిమాలో చూస్తారు. ఈ సినిమాలో తాను యాక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా డ్యూయల్ రోల్ పోషించినా హిమాంక్, నందినీ రెడ్డి ప్రతీ విషయంలోనూ తనకు సపోర్ట్ సిస్టమ్‌లా నిలిచారని సమంత కొనియాడారు. అలాగే రాజ్ అండ్ డీకే గురించి మాట్లాడుతూ.. "వాళ్ల లైఫ్‌లో లక్ అనేది లేదు, కేవలం హార్డ్ వర్క్ మాత్రమే నమ్ముకుంటారు. రూమ్‌లో అందరికంటే ఎక్కువగా ఎలా కష్టపడాలి అనేది వాళ్లను చూసే నేర్చుకున్నాను. అలాగే ఎప్పుడు పిలిచినా సాయం చేసే సీత గారికి థాంక్స్" అని పేర్కొన్నారు. చివరి నిమిషంలో సపోర్ట్ అందించి ఫైనల్ కాపీ ఈరోజే రెడీ అవ్వడానికి కారణమైన మ్యూజిక్ డైరెక్టర్లు మిక్కీ జే మేయర్, సురేష్ బొబ్బిలి, మహేష్ శంకర్‌లకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "మూడేళ్లు గ్యాప్ వచ్చినా నాపై అదే ప్రేమ, సపోర్ట్ చూపిస్తున్నందుకు నేను ఎల్లప్పుడూ కృతజ్ఞతురాలిని. జూన్ 19 తర్వాత మీ రివ్యూస్ కోసం ఎదురుచూస్తుంటాను" అని తన అభిమానులకు పిలుపునిచ్చారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.